

మరణంలోనూ... ఒక్కటిగానే...
భర్త మరణించిన రెండు గంటల్లోనే భార్య మృతి.. ఇంద్రపాలెంలో అలుముకున్న విషాదం
7

నా పెళ్లికి అడ్డురావద్దు.. చచ్చిపో
పురుగుల మందుకి డబ్బులిచ్చి ఆత్మహత్యకు ప్రేరేపించాడు.. ప్రేమ పేరుతో యువతి మృతికి కారణమైన వ్యక్తి అరెస్టు - మెయిన్ 13లో

పెనుగుదురు ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం
7

మనోహరం




తుని మండలం టి.గవరపేటలో మంగళవారం సాయంత్రం నీరెండలో, పొద్దుపోయాక కెమెరాకు చిక్కిన దృశ్యాలు - స్టాఫ్ ఫొటోగ్రాఫర్

సొమ్ము కొట్టు.. కొలువు పట్టు!



- కాంట్రాక్టు కంపెనీ పేరుతో శానిటేషన్, సెక్యూరిటీ విభాగాల్లో నియామకాలు
- ఒక్కో పోస్టుకు రూ.80 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు అక్రమంగా వసూళ్లు
- మూడు నెలల్లో 40 వరకు పోస్టులకు భారీగా దండుడు
- తెరవెనుక చక్రం తిప్పుతున్న ఓ నేత బంధువు
- ఒక్కసారి ఉద్యోగం వస్తే ఏళ్ల తరబడి ధోకా ఉండదంటూ ఉద్యోగాల అమ్మకాలు
- మరోపక్క ఆస్పత్రి శానిటేషన్ విభాగం ఉద్యోగి భార్యకూ సదరు కంపెనీలో ఉద్యోగం
- ఏం జరుగుతున్నా చూసీ చూడనట్టు అధికారులు తీరు
- ఇటీవల కలెక్టర్ జీజీహెచ్‌లో ఆకస్మిక తనిఖీకి వెళ్లడంతో బయటపడుతున్న బాగోతాలు



» కాకినాడ జీజీహెచ్‌లో కాసులిస్తే కొలువులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జీజీహెచ్‌లో కాసులిస్తే ఉద్యోగాలు దొరికేస్తున్నాయి. ఒక్కసారి ఇందులో ఉద్యోగం లో చేరితే ఏళ్ల తరబడి ఢోకా ఉండదంటూ కొందరు అందినకాడికి దండేస్తున్నారు. ఆస్పత్రికి పారిశుధ్య కాంట్రాక్టు సేవలందిస్తున్న కంపెనీ పేరుతో ఓ నేత బంధువు ఎడాపెడా ఉద్యోగాలకు కాసులు వసూలు చేసేస్తున్నారు. శానిటేషన్, సెక్యూరిటీ విభాగాల్లో ఉద్యోగాలకు రూ.80 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. దీంతో కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటివరకు గడచిన మూడు నెలల్లో సదరు నేత బంధువు 40 వరకు ఉద్యోగాలను అమ్ముకోవడం విశేషం. ఇలా ఉద్యోగాలు అమ్ముకుంటుంటే అడ్డుకోవాల్సిన ఆస్పత్రి పారిశుధ్య విభాగం అధికారి తన భార్యను ఈ కాంట్రాక్టు కంపెనీలో కీలకస్థానంలో ఉద్యోగం ఇప్పించుకోవడంతో వీటిని చూసీచూడనట్టు వదిలేస్తున్నారు.

కొలువు దక్కించుకుంటే చాలు..

కాకినాడ జీజీహెచ్ ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు పెద్దదిక్కు. వేలాది మంది పేదలు ఇక్కడకు ఇన్‌పేషెంట్, అవుట్ పేషెంట్లుగా వస్తుంటారు. దీంతో నిత్యం కిటకిటలాడుతుంటుంది. సోమవారం ఓపీ సమయాల్లో ఆస్పత్రి రద్దీ చాలా ఎక్కువగా ఉంటుంది. ఇంత కీలకమైన జీజీహెచ్‌లో నిత్యం పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలి. ఎక్కడా ఏ చిన్న అపారిశుధ్య వాతావరణం ఉండకుండా ప్రభుత్వం ఏటా కోట్లలో నిధులు విడుదల చేస్తుంది. ఆస్పత్రిలో శానిటేషన్ వ్యవస్థను పర్యవేక్షించే బాధ్యత కొన్నేళ్లుగా ప్రైవేటు సంస్థలు దక్కించుకుంటున్నాయి. ఇవి సొంతంగా తమ కంపెనీ పేరుతో ఆస్పత్రిలో పనిచేయడానికి ఉద్యోగులను నియమించుకుంటాయి. ఇందులో పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ ఉద్యోగులు అధికంగా ఉంటారు. ఇలా నియమించుకున్న ఉద్యోగుల లెక్కలను చూపించి సదరు కాంట్రాక్టు కంపెనీ ప్రభుత్వం నుంచి బిల్లులు చేసుకుంటుంది. క్షేత్రస్థాయిలో ఆస్పత్రిలో పని చేసే సిబ్బందికంటే ఎక్కువమంది పనిచేస్తున్నట్టు చూపించి అధికంగా బిల్లులు పొందడం కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. ఒకరకంగా ఆసుపత్రిలో కాంట్రాక్టు కంపెనీ తరుఫున సేవలందిస్తోన్న పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బంది కంటే ఎక్కువ సిబ్బందిని చూపించి నెలనెలా డ్రాచేసే బిల్లులు అధికంగా ఉంటాయి. వాస్తవానికి జీజీహెచ్‌కు పోటెత్తే ఓపీ, ఇన్‌పేషెంట్ విభాగాల్లో రోగులకు సంబంధించి అంచనా ప్రకారం 330 మంది వరకు శానిటేషన్ ఉద్యోగులు, 260 మంది వరకు సెక్యూరిటీ సిబ్బంది పనిచేయాలి. కానీ అంతకంటే తక్కువ సిబ్బందితో పనిచేయిస్తూ కంపెనీలు లాభాలు మిగుల్చుకుంటాయి. ఇటీవల ప్రభుత్వం మారడంతో ఓ నేత బంధువు జోక్యం జీజీహెచ్‌లో అధికమైంది.

మున్ముందు ఇంకా భవిష్యత్తు..

జీజీహెచ్‌లో ఉద్యోగం అంటే మాటలు కాదు. ఇంకా భవిష్యత్తులో ఉద్యోగం బాగుంటుంది. మున్ముందు ఇంకా పోటీ ఎక్కువై అసలు ఉద్యోగం దొరకడం కష్టం అంటూ దళారులు జీజీహెచ్‌లో ఉద్యోగాలకు ధరలు కట్టేసి వసూలు చేస్తున్నారు. ప్రధానంగా ఆస్పత్రిలో సెక్యూరిటీ ఉద్యోగాలకు పురుషులు, పారిశుధ్య విభాగంలో పనికి మహిళలు పోటీ పడతారు. దీన్ని ఆసరగా చేసుకుని దళారులు ఇలా ఉద్యోగాలు అమ్మేస్తుండడం విశేషం. ఇలా ఇప్పటివరకు 40 మంది నుంచి డబ్బులు తీసుకుని కొలువులు ఇచ్చేశారు. కొందరు ఎంతకాలం ఈ ఉద్యోగం ఉంటుందని ప్రశ్నిస్తే కొన్నేళ్లపాటు ఉంటుందని నమ్మబలుకుతున్నారు. కాగా ఆస్పత్రిలో కాంట్రాక్టు కంపెనీలో ఉద్యోగాలు ఇలా కొందరు డబ్బులు వసూలు చేస్తున్న వ్యవహారంపై ఇప్పటికే జీజీహెచ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. అటు కొలువులకు డబ్బులు ఇచ్చుకోలేక ఉద్యోగాలు పొందలేని కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి నిర్ణయించారు. మరోపక్క జీజీహెచ్‌లో సేవల్లో లోపాలపై కలెక్టర్‌కు వరుసగా ఫిర్యాదులు రావడంతో ఇటీవల ఆకస్మిక తనిఖీలకు వెళ్లారు. లోపల పారిశుధ్య విభాగంతోపాటు ఇన్ పేషెంట్ గదులను తనిఖీ చేశారు. ఈ సమయంలో అనేక లోపాలు కలెక్టర్ దృష్టికి వచ్చాయి. దీంతో వాటన్నింటినీ త్వరలో పరిష్కరించి ఆస్పత్రి పని తీరును మెరుగుపర్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల జరిపిన ఆకస్మిక తనిఖీ ఎక్కువసేపు కొనసాగించాల్సి ఉన్నా సమయం లేక త్వరలో జీజీహెచ్‌కు వెళ్లి సేవలను పట్టాలెక్కించాలని భావిస్తున్నారు.

అంగన్‌వాడీల ‘యాప్’ సోపాలు

- గర్భిణీలు, బాలింతలకు డ్రైరేషన్ పంపిణీకి అవస్థలు
- సహకరించని ఫోన్లు, లబ్ధిదారులు
- సరుకులు ఇవ్వాలంటే ఎఫ్ఆర్ఎస్ తప్పనిసరి
- ఫొటోలు అప్‌లోడ్ కాకపోవడంతో తిప్పలు
- ఒకటికి పదిసార్లు తిరగాల్సి వస్తోందంటూ ఆవేదన
- ఏడు నుంచి మూడేళ్ల బాలలకు తప్పనిసరి



పెద్దాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గర్భిణీ, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందించే అంగన్‌వాడీలపై ఫేస్ యాప్ రూపంలో మరో పనిభారం పడింది. అప్పటికే బాలసంజీవిని ద్వారా లబ్ధిదారులకు ఫేస్ యాప్ ద్వారా రేషన్ ఇస్తుండగా కేంద్రం రూపొందించిన పోషణ్ ట్రాకర్ యాప్‌లో కూడా లబ్ధిదారులకు ఫేస్‌యాప్‌లో గుర్తింపు తప్పనిసరి చేస్తూ మరోమారు లబ్ధిదారుల వివరాలు నమోదు ప్రారంభించారు. దీంతో రెండు యాప్‌ల్లో లబ్ధిదారుల ముఖ గుర్తింపు నమోదు కష్టతరంగా మారింది. నమోదు విషయంలో కనీసం ఐసీడీఎస్ సిబ్బందికి కూడా సరైన శిక్షణ లేకపోవడంతో గందరగోళంగా మారింది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణి, బాలింతలకు 7నెలలు -3ఏళ్ల బాలలకు ప్రతినెలా పోషకాహారాన్ని ఇంటికే అందిస్తున్నారు. గతంలో కేంద్రం వద్ద వండి ఇచ్చేవారు. ఎక్కువమందికి టేక్ హోమ్‌రేషన్(టీహెచ్ఆర్) కావాలంటూ అభ్యర్థనలు రావడంతో పాలు, గుడ్లు, నూనె, పప్పు బియ్యం వంటివి లబ్ధిదారులకు ప్రతినెలా రెండు దఫాలు ఇస్తున్నారు. టీహెచ్ఆర్ పంపిణీలో అవకతవకలు జరగకుండా ప్రభుత్వం ఎఫ్ఆర్ఎస్‌ను ప్రవేశపెట్టింది. లబ్ధిదారులు వచ్చిన సమయంలో వారి ముఖచిత్రం ద్వారా గుర్తించి యాప్‌లో నమోదు చేసి టీహెచ్ఆర్ అందించేవారు. ఇక గర్భిణులు, బాలింతలు, చిన్నారుల పూర్తి వివరాలను మరోసారి పోషణ ట్రాకర్ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ యాప్‌లో కూడా లబ్ధిదారుల ముఖచిత్రాన్ని రిజిస్ట్రేషన్ చేయాల్సి వస్తోంది. ఒకే వ్యక్తి వివరాలను రెండు యాప్‌ల్లో నమోదు చేయడం టీహెచ్ఆర్ పంపిణీ సమయంలో ఒకే వ్యక్తికి రెండుసార్లు ఫేస్‌యాప్ గుర్తించడం ఇబ్బందికరంగా మారింది. ఇందుకు ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన ఫోన్లు అనుకూలంగా లేవని తెలుస్తోంది. ఒకటికి పదిసార్లు తిరగాల్సి వస్తోందని అంగన్‌వాడీలు వాపోతున్నారు. పైగా ఫొటోలు అప్‌లోడ్ కాక తిప్పలు పడాల్సి వస్తోందని చెబుతున్నారు. సాధారణంగా టీహెచ్ఆర్ కోసం 7నెలలు - 3 ఏళ్ల వయసుగల పిల్లలు కేంద్రానికి రారు. వారి తల్లిదండ్రులుగానీ, ఇంట్లో పెద్దలుకానీ వస్తారు. ప్రస్తుతం పిల్లలకు రెండుసార్లు ముఖచిత్రం ద్వారా టీహెచ్ఆర్ పంపిణీకి చాలా సమయం పడుతోంది. ఒక్కో కేంద్రం పరిధిలో 20 నుంచి 25 మంది వరకూ గర్భిణులు, బాలింతలు ఉంటే 7నెలలు - 3ఏళ్ల వయసుగల పిల్లలు 75 నుంచి 150 వరకూ ఉంటారు. వీరందరి వివరాలను యాప్‌లో నమోదు చేసి ఇవ్వడానికి చాలా సమయం పడుతోంది. దీనివల్ల పూర్వ ప్రాథమిక విద్య దెబ్బతినే అవకాశాలున్నాయని అభిప్రాయపడుతున్నారు.

అధికార యంత్రాంగం ఒత్తిడి..

నిర్ణీత సమయంలో యాప్‌ల్లో వివరాలను నమోదు చేయాలంటూ యంత్రాంగం ఒత్తిడి తీసుకువస్తుంటే పోషణ్ ట్రాకర్ పూర్తిస్థాయిలో పనిచేయని పరిస్థితి నెలకొంది. ఈ విధానంపై సరైన శిక్షణ ఇవ్వలేదు. ఫేస్ యాప్‌లో నమోదు చేసేటప్పుడు లబ్ధిదారుల ఫోన్‌కు ఓటీపీ వెళ్తుంది. దీన్ని చెప్పడానికి సందేహిస్తున్నారు.

పాఠశాలల నిర్వహణకు నిధులు

కాకినాడ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓవైపు నిధుల్లో కోత... మరోవైపు విడుదలలో జాప్యం వెరసి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలలు, కార్యాలయాల నిర్వహణ ఉపాధ్యాయులకు, అధికారులకు భారంగా మారింది. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చామని గత ప్రభుత్వం చెప్పుకున్నప్పటికీ కనీసం పాఠశాలల నిర్వహణకు అవసరమైన నిధులను రెండేళ్లుగా విడుదల చేయలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ విద్యాశాఖను ప్రక్షాళనచేయడంతోపాటు పాఠశాలల నిర్వహణకు రూ.100 కోట్లు మంజూరుచేస్తున్నట్టు ప్రకటించడంపై ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తంచేస్తున్నాయి. పాఠశాలల నిర్వహణతోపాటు మండల వనరుల కేంద్రం(ఎంఆర్సీ), క్లస్టర్ రిసోర్స్ సెంటర్ (సీఆర్సీ)లకు నిధులు విడుదలచేయాల్సి ఉన్నా గత వైసీపీ ప్రభుత్వం నిధుల కొరత పేరుతో 2021-22లో 20 శాతం మాత్రమే విడుదలచేసి చేతులు దులుపుకుంది. తరువాత 2022-23, 2023-24 విద్యా సంవత్సరాలకు రెండేళ్లూ ఎంఆర్సీ, సీఆర్సీలకు నిధులను విడుదలచేయలేదు. అప్పట్లో విద్యుత్ బిల్లుల చెల్లింపులు, రిజిస్టర్ల కొనుగోలు, చాక్‌పీస్‌లు తదితర కొనుగోళ్లకు ప్రధానోపాధ్యాయుల జేబుల్లోంచి ఖర్చుచేశారు. ప్రస్తుతం జిల్లాలోని 21 మండలాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, హైస్కూల్ ప్లస్ ప్రభుత్వ పాఠశాలలు మొత్తం 1218 ఉండగా వాటికి రూ.1,53,21,000 నిర్వహణ నిధులు రానున్నాయి. అయితే మొదటి దశలో 50 శాతం నిధులు మంజూరుచేస్తున్నట్టు సమాచారం. మిగతా నిధులను రెండో దశలో మంజూరు చేయనున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

చిన్నారుల భద్రత, రక్షణకు ప్రాధాన్యం

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చిన్నారుల భద్రత రక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తూ నూరుశాతం చిన్న పిల్లల సురక్షితమైన జిల్లాగా కాకినాడను తీర్చిదిద్దేందుకు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. చిన్నారుల భద్రతా, సంరక్షణ, లైంగిక వేధింపులకు గురవకుండా చిన్నారులను కాపాడుకోవడం వంటి అంశాలపై కాకినాడ సీపోర్టు లిమిటెడ్, పడాల చారిటబుల్ ట్రస్ట్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులకు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో నిత్యం చిన్నారులు ఏదో ఒకరకంగా లైంగిక వేధింపులకు గురవుతున్నారన్నారు. చిన్న వయసులో జరిగే లైంగిక వేధింపుల నుంచి మన పిల్లలను కాపాడుకోవడానికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలన్నారు. జిల్లాలో చిన్నారుల భద్రత రక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తూ నూరు శాతం చిన్న పిల్లల సురక్షితమైన జిల్లాగా కాకినాడను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. చిన్నపిల్లల పట్ల ప్రవర్తించాల్సిన తీరుపై సరైన అవగాహన లేకపోవడంతో చిన్నారులు తరుచుగా లైంగిక వేధింపులకు గురవుతున్నారన్నారు. 18 ఏళ్లలోపు ఉన్న ప్రతి ఒక్కరు పిల్లలేనని, 97 శాతం అందరూ తెలిసిన పిల్లలు తరచుగా లైంగిక వేధింపుల బారిన పడుతున్నారన్నారు. పిల్లలతో కలిసి పనిచేసే ప్రభుత్వ, ప్రైవేటు స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో తల్లిదండ్రులతోపాటు చిన్నారులకు సురక్షితమైన స్పర్శ, చెడు స్పర్శ వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ భావనా, అడిషనల్ ఎస్పీ భాస్కరరావు, పడాల చారిటబుల్ ట్రస్ట్ సీఈవో సూర్యప్రసాద్, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, ఇన్‌చార్జ్ డీఆర్డీఏ పీడీ శ్రీరమణి, ఐసీడీఎస్ పీడీ ప్రవీణ, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, డీఈవో రమేష్, సీపీవో త్రినాథ్, డీపీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న జేసీ రాహూల్ మీనా, తోట సుధీర్ తదితరులు

మురారిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

హాజరైన పౌరసరఫరాల సంస్థ చైర్మన్ సుధీర్, జేసీ

గండేపల్లి, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలం మురారిలో మంగళవారం ఏపీ పౌర సరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్‌కుమార్ చేతుల మీదుగా ఖరీఫ్ 2024 సీజన్‌కుగాను జేసీ రాహుల్ మీనా సమక్షంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ సుధీర్ మాట్లాడుతూ రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలనే లక్ష్యంతో ఈ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఏ రైతు కూడా దళారుల చేతిలో తక్కువ ధరకు తమ పంటను అమ్ముకోవద్దని తెలిపారు. జేసీ రాహుల్‌మీనా మాట్లాడుతూ కాకినాడ జిల్లావ్యాప్తంగా ఖరీఫ్ 2024 సీజన్‌కు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం ప్రక్రియ మొదలైందని దానిలో భాగంగా ఇక్కడ కేంద్రం ప్రారంభించామన్నారు. రైతులు తమ పంటకు బయట మంచి ధర దొరికితే అమ్ముకోవచ్చని, తక్కువ ధరకు ఎవరూ అమ్ముకునే పరిస్థితి ఉండకుండా రైతు సేవా కేంద్రాలను గ్రామ స్థాయిలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సంబంధిత సిబ్బంది రైతులకు ప్రతీ దశలో అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జాస్తి వసంత్, పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్లు తుమ్మల పద్మజ, కడలి ఈశ్వరి, జడ్పీటీసీ పరిమి బాబు, ఎంపీపీ చలగాళ్ల దొరబాబు, వైస్ ఎంపీపీ కుంచే రాజు, సర్పంచ్ కుక్కల ఆనందబాబు, రైస్ మిల్లర్స్ ప్రెసిడెంట్ నున్న రామకృష్ణ, ఆర్డీవో, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ ఎం.దేవులనాయక్, ఎంపీడీవో నాతి బుజ్జి, తహసీల్దార్ ఆర్.శ్రీనివాసరావు, ఏవో సద్గురుమూర్తి, సీఎస్ఆర్ శివకుమార్ పాల్గొన్నారు.

మహిళలకు శుభవార్త



దీపం పథకం కింద ఉచితంగా గ్యాస్ సిలిండర్లు
దీపావళి పండుగ నుంచి ప్రారంభం
2 లక్షల 25 వేల మందికి ప్రయోజనం

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈనెల 31వ తేదీ దీపావళి పండుగ నుంచి దీపం పథకం కింద ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయనుంది. ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లాలో మొత్తం గ్యాస్ వినియోగదారులు 6,97,602 మంది ఉండగా దీనిలో 30 శాతం మంది దీపం పథకంలో ఉన్నారు. అంటే 2లక్షల 25వేల మందికి ఉచితంగా సిలిండర్లు అందనున్నాయి. ఏడాదికి రూ.2,684 సొమ్ము ఒక్కొక్క కుటుంబానికి ఆదా కానుంది. మహిళల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసింది. అసలే ఆర్థిక బాధలతో ఇబ్బందులు పడుతున్న పేదలకు ఇది పెద్ద వరమే నని మహిళలు అంటున్నారు. ఏటా మూడు పర్యాయాలు సిలిండర్లు ఉచితంగా ఇవ్వడం వల్ల సొమ్ము ఆదా అవుతుంది. గ్యాస్ వినియోగదారులను మండలాలవారీగా పరిశీలిస్తే కాకినాడ అర్బన్‌లో 1,23,663 మంది అత్యధికంగా ఉన్నారు. గండేపల్లిలో 10061, గొల్లప్రోలులో 20819, జగ్గంపేటలో 28727, కాజులూరులో 13196, కాకినాడ రూరల్‌లో 86150, కరపలో 17423, పెదపూడిలో 4787, పెద్దపురంలో 57661, పిఠాపురంలో 63060, ప్రత్తిపాడులో 16060, రౌతులపూడిలో 25480 ఉన్నారు. అలాగే సామర్లకోటలో 47246, శంఖవరంలో 39057, తాళ్లరేవులో 21157, తొండంగిలో 35285, తునిలో 39625, యు.కొత్తపల్లిలో 7868, ఏలేశ్వరంలో 4595 మంది ఉన్నారు.



సీఎంను ఆహ్వానిస్తున్న శృంగేరి పీఠం ప్రతినిధులు, ఎమ్మెల్యే నెహ్రూ

ఆలయ శంకుస్థాపనకు సీఎంకు ఆహ్వానం

జగ్గంపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబునాయుడిని గండేపల్లి మండలం నాయకంపల్లి గ్రామంలో నిర్మాణమవుతున్న అతిపెద్ద అగ్నిహోత్రిని ఆలయ శంకుస్థాపన నవంబరు 26న నిర్వహిస్తున్నామని, దీనికి శృంగేరి పీఠాధిపతులు విచ్చేస్తున్నారని, ఈ శంకుస్థాపనకు సీఎం చంద్రబాబునాయుడిని విచ్చేయాలని ఆంధ్ర, తెలంగాణ శృంగేరి ప్రతినిధి బంగారయ్యశర్మ ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గోకవరం ఆటో యూనియన్ అందించిన రూ.88వేలు చెక్కును సీఎం సహాయ నిధికి చంద్రబాబుకు అందించారు. అనంతరం జై ద్వారకా పోస్టర్ ప్రచార కార్యక్రమాన్ని సీఎంతోపాటు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, మాజీ ఎమ్మెల్సీ చైతన్య విద్యాసంస్థల అధినేత చైతన్యరాజు పాల్గొన్నారు.





ఐదు వేల ఏళ్లు జీవించే

మహావృక్షం

- ఏనుగుపాదాల చెట్టుగా నానుడి
- ఆఫ్రికా నుంచి తెచ్చిన వర్తకులు
- పరిరక్షిస్తున్న నగర కార్పొరేషన్



అడన్సొనియా డిజిటేటా మహావృక్షం

ఏ చెట్టు అయినా జీవితకాలం వందల ఏళ్లు ఉంటుందని తెలిసిందే. కానీ ఐదు వేల సంవత్సరాలు జీవించే వృక్షం ఒకటి ఉందని చాలామందికి తెలియకపోవచ్చు. ఈ మహావృక్షం గత 300 ఏళ్లకు పైబడి రాజమహేంద్రవరంలోనే పరిరక్షింపబడడం విశేషం. ఈ మహావృక్షం ఎన్నో తరాలను చూస్తూ బతికేస్తోంది. అనేక ప్రకృతి వైపరీత్యాలనూ తట్టుకుని నిలబడింది. రాజులకాలం రాచరికాన్ని, బ్రిటీష్ పాలకుల నియంతృత్వాన్ని, స్వదేశీ పాలకుల ఆదరణను ఈ మహావృక్షం చవిచూస్తూనే ఉంది. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కార్యాలయం ప్రాంగణంలో పాత ప్రవేశ ద్వారం పక్కనే ఈ వృక్షం దర్శనమిస్తుంది. ఇది బూరుగు జాతికి చెందిన అడన్సొనియాడిజిటేటా అనే పేరుగల మహావృక్షం. దీన్ని మన దేశంలో బ్రహ్మఆమిక గోరక్ ఇమ్లి, మంకిబ్రెడిట్రీ అని కూడా పిలుస్తారు. ఆఫ్రికా దేశానికి చెందిన ఈ మహావృక్షాన్ని నవాబుల కాలంలో వర్తకులు రాజమహేంద్రవరానికి తీసుకువచ్చి ప్రస్తుతం నగరపాలక సంస్థ ఉన్న కార్యాలయం ప్రాంతం (నాటి కోటగుమ్మం వెలుపల) నాటారు. 300 ఏళ్ల పైబడి వయస్సు ఈ వృక్షానికి ఉంటుంది. ఈ వృక్షం ఐదు వేల సంవత్సరాలు జీవిస్తుందని వృక్ష శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇక్కడ ఉన్న ఈ వృక్షాన్ని 2008 వరకు రాజమహేంద్రవరంలో దీన్ని చూసిన వారంతా మామూలు బూరుగు జాతిచెట్టుగానే అనుకున్నారు. కానీ అప్పటి నగరపాలక సంస్థ కమిషనర్ రాజేంద్రప్రసాద్ ప్రకృతి ప్రేమికుడు కావడంతో ఈ చెట్టును పరిశీలించి దీన్ని జాతిని గుర్తించారు. వెంటనే ఒక శిలాఫలకాన్ని అక్కడ పెట్టించి దానిపై విశిష్ఠత, చరిత్రను లిఖించారు. చెట్టు చుట్టూ సిమెంట్ కాంపౌండ్‌ను కట్టించారు. అప్పటికిగాని ఈ చెట్టు ప్రాధాన్యత బహిర్గతం కాలేదు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని అడన్సొయాడిజిటేటా చెట్టును ప్రజలు ఏనుగు పాదాల చెట్టుగా పిలుస్తున్నారు. ఈ చెట్టు గురించి ప్రజలకు తెలియకపోవడంతో దాని కాండం, మొదలు ఆకారం ఏనుగును, వాటి కాళ్లను తలపించేలా ఉండడంతో దీన్ని ఏనుగుపాదాల చెట్టుగా పిలవడం ప్రారంభించారు. సాధారణంగా ఏ చెట్టు కాండం చుట్టు కొలత పెద్దగా అంటే 6 మీటర్లు ఉంటుంది. కానీ ఈ మహావృక్షం చుట్టు కొలత 15 నుంచి 20 మీటర్ల వరకు ఉంది. చెట్టు మొదలకు వెళితే దాని ఆకారం చూస్తేనే ఏనుగు నిలబడినట్టు కనిపిస్తుంది. రాజుల కాలంలో ఈ వృక్షాల కాండంలో తొరలు తొలిచి అందులో శత్రువుల కంటపడకుండా తలదాచుకునే సంఘటనలు కూడా జరిగాయని చెబుతుంటారు. ఈ వృక్షం మే నుంచి ఆగస్టు వరకు పూత పూస్తుంది. ఏప్రిల్ నాటికి కాయలు కాసి పక్వానికి వస్తాయి. చిన్న కొబ్బరికాయ పరిమాణంలో కాయలు ఉంటాయి. ఈ కాయలో తెల్లటి సుద్దలా పప్పు ఉంటుంది. ఇది పూర్తిగా పుల్లగా ఉంటుంది. ఈ పప్పుతో ఆఫ్రికా దేశాల్లో షర్బత్‌లు చేసుకుని తాగుతారట. ఇక్కడ మాత్రం వాటిని చెట్టుకే వదిలేస్తారు. కానీ ఈ చెట్టు బెరడుతో చేసిన కషాయం మలేరియాను కంట్రోల్ చేస్తుందని, షరబత్‌తో బంక విరోచనాలు తగ్గుతాయని కొందరు పెద్దలు చెబుతున్నారు. అయితే తర్వాత కాలంలో ఈ చెట్టు మరికొన్ని చోట్ల కూడా ఉందని కడియం నర్సరీల యజమాని ఒకరు చెప్పారు. ఏనుగుపాదాల చెట్టుగాను, కల్పవృక్షంగాను పిలుస్తారని తెలిపారు. అయితే రాజమహేంద్రవరంలోని చెట్టు మాత్రం పురాతనమైందని, అనేక తుఫాన్లను తట్టుకుని నిలబడి ఉండడం విశేషమని 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

కార్పొరేషన్ పరిరక్షణ

అరుదైన జాతి వృక్షంగా ఉన్న అడన్సొయా డిజిటేటా మహావృక్షాన్ని రాజమహేంద్రవరంలో బ్రిటిష్ పాలకుల నుంచి నేటి పాలకుల వరకు కాపాడుకుంటూ వచ్చారు. నాటి బ్రిటీష్ గవర్నర్ నివాసంగా ఉన్న ప్రస్తుత నగరపాలక సంస్థ కార్యాలయం పాత కట్టడం ఎదురుగా ఈ వృక్షం ఉంటుంది. రాజమహేంద్రవరంలో నవాబులు పాలించిన కాలంలో ముస్లిం వర్తకులు నాటిన ఈ వృక్షాన్ని నాటి బ్రిటిష్ పాలకులు, తర్వాత మన పాలకులు ఈ వృక్షాన్ని సంరక్షిస్తూ వచ్చారు. ఇప్పుడు నగర పాలక సంస్థ అధికారులు ఈ వృక్షాన్ని పరిరక్షిస్తూ వస్తున్నారు. ఈ వృక్షం ఐదు వేల ఏళ్ల జీవనం సాగిస్తుందనడానికి నిత్యయవ్వనం అన్నట్టుగా ఈ చెట్టు కనిపించడమే నిదర్శనం.

- ఆంధ్రజ్యోతి, రాజమహేంద్రవరం సిటీ





పైండావారి సత్రంలో సీలింగు ఫ్యాను.. పక్కన తయారీ లేబుల్

80 ఏళ్లుగా తిరుగుతూనే ఉంది..

పైండావారి సత్రంలో సీలింగు ఫ్యాను.. ఇప్పటిదాకా రిపేరు అనేదే లేదు

రామచంద్రపురం మండలం ద్రాక్షారామలోని పైండా వెంకన్న రామకృష్ణయ్య సత్రంలో అడుగుపెడితే హాలులో ఉన్న పెద్ద పెద్ద రెక్కలతో భారీ సైజులో పెద్ద ఆకారంలో సీలింగు ఫ్యాను ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తుంది. ప్రస్తుతం వాడుకలో ఉన్న స్మార్ట్ ఫ్యాన్లకు కాస్త భిన్నంగా ఉంటుంది. ఫ్యాను ప్రత్యేకత ఏమిటంటే ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 80 ఏళ్లకుపైబడి ఈ సీలింగు ఫ్యాను తిరుగుతూనే ఉంది. ఇప్పటివరకు రిపేరు లేదు. రెండుసార్లు రంగులు వేశారంతే.. ఫ్యాను స్విచ్ వేస్తే హాలులో ఉన్న వారిపై గాలి వెదజల్లుతూ ఉంటుంది. పైండా వెంకన్న రామకృష్ణయ్య సత్రాన్ని 1826లో బంగాళా పెంకుటిల్లులో స్థాపించారు. ద్రాక్షారామ భీమేశ్వరాలయానికి వచ్చే యాత్రికులకు రోజుకు ఎకరం పొలం పంటతో అన్నదానం చేయాలనే సంకల్పంతో 360 ఎకరాలు భూమిని సత్రంపేరిట రాసి పైండా వంశీకులు సత్రం స్థాపన చేశారు. తదుపరి కాలంలో 1940లో సత్రం భవన నిర్మాణం చేశారు. హాలులో జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీ ఇండియా లిమిటెడ్‌కు చెందిన సీలింగు ఫ్యాను వేశారు. బ్రాండ్ పేరు ఎవరెస్ట్. 'సీలింగు ఫ్యాను 1940లో తయారుచేశారు. అప్పటి నుంచి సీలింగ్ ఫ్యాను తిరుగుతూనే ఉంది. ఈ ఫ్యాను నాటి వస్తువుల నాణ్యత, మన్నికకు ఓ సాక్ష్యం. - ఆంధ్రజ్యోతి, ద్రాక్షారామ



వాడపల్లి వేంకటేశ్వరస్వామి వసంత మండపంలో ఉత్సవ మూర్తులకు అభిషేకం చేస్తున్న వేద పండితులు



స్వామివారి మూలవిరాట్‌కు బంగారు పుష్పాలతో పూజలు చేసిన దృశ్యం



వసంత మండపంలో బ్రహ్మోత్సవ పూజలు చేస్తున్న దృశ్యం

శ్రీనివాసా గోవిందా..

- వైభవంగా రెండో రోజు బ్రహ్మోత్సవాలు
- కోదండరామ అలంకరణలో శ్రీవారు
- ఆకట్టుకున్న స్వామివారి అష్టదళపాదపద్మారాధన
- సరస్వతీ అలంకరణతో శ్రీవారి హంసవాహన సేవ

ఆత్రేయపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం రెండో రోజు ఘనంగా జరిపారు. స్వామివారిని స్వర్ణశోభితుడ్ని చేసి నెమలి పింఛాలతో అలంకరించారు. పరిమళ పుష్పాలతో అలంకరించిన వసంత మండపంలో శ్రీవారు కొలువుతీరారు. ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యుల బ్రహ్మత్వంలో వేదపండితులు, అర్చకులు విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనము, సప్త కలశారాధన మహా స్నపనము, వసంతోత్సవం నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు 108 బంగారు పుష్పాలతో అష్టదళ పాదపద్మరాధన కన్నుల పండుగ నిర్వహించారు. యాగశాలలో ప్రధాన హోమాలు, వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య జరిపారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధర రావు, కనకదుర్గాదేవి దంపతులు బ్రహ్మోత్సవంలో పాల్గొన్నారు. సాయంత్రం హనుమత్ మూలమంత్ర హవనము, అష్టోత్తర కలశారాధన, వేదఘోష, మంగళ వాయిద్యాల మధ్య వైభవంగా నిర్వహించారు. హనుమత్ వేషధారణ, కేరళ వాయిద్యాలు, హనుమత్ వేషధారణ, తెలంగాణ తీన్‌మార్ వంటి పలు ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. విద్యుత్‌దీపాలు, పుష్పాలంకరణ, వేద ఘోష, భక్తుల గోవిందనామాలు, సాంస్కృతిక ప్రదర్శనల మధ్య వాడపల్లి మారుమోగింది. అనంతరం రాత్రి సరస్వతి అలంకరణతో శ్రీవారు హంసవాహనంపై ఆశీనులయ్యారు. బాణసంచా కాల్పులతో పాటు భక్తుల హరి నామస్మరణ మధ్య తిరువీధుల్లో స్వామివారు విహరించి అభయహస్తం అందించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలలో కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, లక్ష్మీమంగతాయారు దంపతులు, ముదునూరి వెంకట్రాజు, సత్యశ్రావణి దంపతులు, కాయల జగన్నాథం, మంగాదేవి దంపతులు పాల్గొన్నారు.

నేడు వాడపల్లిలో..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు బుధవారం సుప్రభాతసేవ, అష్టోత్తర శత కలసాభిషేకం, వేంకటేశ్వర హోమం, కోదండరామ అలంకరణలో శ్రీవారి హనుమత్ వాహన సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



సరస్వతీ అలంకరణతో హంస వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

ఆటో డ్రైవర్‌కు ఎస్పీ సన్మానం

ఇద్దరు విద్యార్థినుల కాపాడినందుకు అభినందన

దేవరపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ ఇద్దరు ప్రాణాలను కాపాడిన నేపథ్యంలో మంగళవారం తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ సన్మానించారు. దేవరపల్లి గ్రామానికి చెందిన డేగల కోటేశ్వరరావు(కోటి) ఈనెల 19న రాజమహేంద్రవరం వెళుతుండగా ఇద్దరు ఆడపిల్లలు గోదావరి వంతెనపై నుంచి దూకడానికి యత్నించారు. దీంతో వాళ్ళను అడ్డుకుని ఆటోలో దేవరపల్లి తీసుకువచ్చి పోలీసులకు అప్పగించారు. కోనసీమ జిల్లా అమలాపురం పట్టణానికి చెందిన ఇద్దరు విద్యార్థి నులు రాజమహేంద్ర వరంలో ఇంటర్ చదు వుతూ హాస్టల్‌లో ఉంటు న్నారు. వారిద్దరు హాస్టల్‌లో ఉండి చదవలేక రాజమహేంద్రవరం గోదావరి వంతెనపె నుంచి దూకే ప్రయత్నం చేశారు. దీంతో ఆటోడ్రైవర్ అడ్డుకుని వారిని పోలీసులకు అప్పగించారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో అతన్ని సన్మానించి బహుమతి అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ ఇద్దరు విద్యార్థినుల ప్రాణాలను కాపాడిన ఆటోడ్రైవర్ వ్యవహరించిన తీరు అభినందనీయమన్నారు.



ఆటోడ్రైవర్ కోటేశ్వరరావును సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ నరసింహకిషోర్



బాలాత్రిపుర సుందరి అమ్మవారి హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

బాలాత్రిపుర సుందరి అమ్మవారి హుండీ

ఆదాయం లెక్కింపు

పోర్టు సిటీ (కాకినాడ), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోనున్న శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో హుండీలు లెక్కించగా రూ.9 లక్షల 786 ఆదాయం వచ్చింది. మంగళ వారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ తనిఖీ దారు వడ్డి ఫణీంద్ర కుమార్ పర్యవేక్షణలో మొత్తం 8 హుండీలను లెక్కించారు. నోట్ల రూపంలో రూ.7,94,920, నాణేల రూపంలో రూ.1,05,866 కలిపి మొత్తం రూ.9,00,786 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వ హణాధికారి వండువల్లి వీర్రాజు చౌదరి తెలి పారు. ఈ ఆదాయం 40 రోజులకు వచ్చిం దని చెప్పారు. కార్యక్రమంలో దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జి, ప్రధానార్చ కులు చెరుకూరి సుబ్రహ్మణ్యం, రామారావుపేట అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవాలయం కార్య నిర్వహణాధి కారి బాదం శ్రీరామచంద్ర మూర్తితో పాటు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూర్యారావుపేట బ్రాంచి సిబ్బంది, రెవెన్యూ, పోలీస్ ఉద్యోగులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



యాత్రా.. స్పెషల్స్!

- ప్రముఖ పుణ్య క్షేత్రాల యాత్రలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సుల ఏర్పాటు
- కాకినాడ నుంచి 20 కొత్త బస్సులు సిద్ధం చేసిన అధికారులు
- పంచారామ క్షేత్రాల నుంచి అయోధ్య వరకు ఎక్కడికైనా వెళ్లొచ్చు
- శబరిమలైకి వివిధ ప్యాకేజీలతో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నుంచి శబరిమలకు ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీలను ప్రకటించింది. యాత్ర జరిగే రోజుల సంఖ్యనుబట్టి మార్గంలో ఆలయాల కవరేజీ ఉండనుంది. ఈ ఏడాదీ శబరిమలై యాత్రకు వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక అద్దె బస్సులను ఏర్పాటు చేసింది. మూడు రకాల ప్యాకేజీలతో ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. నాలుగు రోజుల ప్యాకేజీ, ఏడు రోజులు ప్యాకేజీ, 11 రోజుల ప్యాకేజీగా ఏర్పాటుచేశారు. మార్గంలో ఉన్న కొన్ని ఆలయాల కవరేజీలో కొద్దిగా వ్యత్యాసంతో నిర్వహిస్తారు. భక్తులు సందర్శించడానికి ఎంచుకున్న దేవాలయాల ఆధారంగా వారి అవసరాల మేరకు ఈ యాత్రలు రూపొందించారు.

శబరిమలై యాత్రల ప్యాకేజీ..

కాకినాడ నుంచి విజయవాడ కనకదుర్గ, శబరిమలైకి నాలుగురోజుల యాత్ర ప్యాకేజీతో సూపర్‌లగ్జరీ బస్సు ఏర్పాటు చేశారు. ఒక్కొక్కరికి టికెట్ ధర రూ.5 వేలు. 7 రోజుల ప్యాకేజీతో శ్రీశైలం, మహానంది, శ్రీపురం, అరుణాచలం, శబరిమలై, పళని, కాణిపాకం, తిరుపతి, విజయవాడకి సూపర్‌లగ్జరీ బస్సు ఏర్పాటుచేశారు. ఒక్కొక్కరికి టికెట్ ధర రూ.5850. అలాగే 11 రోజుల ప్యాకేజీతో విజయవాడ, శ్రీశైలం, మహానంది, మంత్రాలయం, హంపి, గోకర్ణ, మురుడేశ్వర్, మూగాంబికదేవి, ఉడిపి, ధర్మస్థలి, శ్రీరంగపట్నం, మైసూర్, బృందావనం, గురువాయర్, ఏరుమేలి, పంబ, శబరిమల, నరులేనిల్, తిరువనంతపురం, కన్యాకుమారి, రామేశ్వరం, మధురై పళని, అరుణాచలం, శ్రీపురం, కాణిపాకం, తిరుపతికి సూపర్‌లగ్జరీ బస్సు ఏర్పాటుచేశారు. ఒక్కొక్క టికెట్ ధర రూ.8,700 ఉంటుంది. ఆయా ప్యాకేజీలను బట్టి ఆ ప్రదేశాలుంటాయి. అయ్యప్ప భక్తులకు సేవలందించడంలో అనుభవం ఉన్న నిష్ణాతులైన డ్రైవర్లు బస్సులను నడుపుతారు.

కాకినాడ-శ్రీశైలం సర్వీసు రోజూ..

కాకినాడ నుంచి శ్రీశైలం వెళ్లాలనుకునే భక్తులకు ప్రతిరోజూ ఉదయం 7.30గంటలకు, సా యంత్రం 6.30 గంటలకు బస్సు సౌకర్యం ఉంది. కార్తీకమాసం నెలరోజులు అదనంగా సాయంత్రం 4.30గంటలకు ప్రత్యేక బస్సు సౌకర్యం ఏర్పాటుచేశారు. ఈ బస్సులకు టిక్కెట్ ధర రూ.894గా ఉంది.

కాశీ, అయోధ్య యాత్ర స్పెషల్..

10 రోజులు.. 14 క్షేత్రాలు

అయోధ్యలో కొలువైన రాముడిని దర్శించుకోవాలనుకునే వారి కోసం అయోధ్యతోపాటు పలు పుణ్యక్షేత్రాలు కవరయ్యేలా ఆర్టీసీ పలు సర్వీసులు తీసుకువచ్చింది. టికెట్ ధర కూడా కాస్త అందుబాటులో ఉండడంతో ప్రయాణికులు ఆసక్తి చూపుతున్నారు. ఈ సర్వీసులు అయోధ్య మీదుగా కాశీ వరకు అందుబాటులో ఉన్నాయి. 10 రోజుల్లో 14 క్షేత్రాలకు ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా రూట్ మ్యాప్ ఉంటుంది. పూరి, కోణార్క్, సాక్షి గోపాలం, భువనేశ్వర్, జాజ్‌పూర్, గయ, బుద్ధగయ, శిరోగయ, కాశీ, త్రివేణి సంగమం, సీతామడి, ప్రయాగ, అయోధ్య, నైమిశారణ్యం వంటి పలు పుణ్యక్షేత్రాలు కవరయ్యేలా ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లుచేశారు. తక్కువ ఖర్చులోనే తీర్థయాత్రలకు వెళ్లాలనుకునే వారికి టూర్ ప్రయోజనం కలిగిస్తుంది. మరోవైపు ఈ సర్వీసుల్లో ప్రయాణం కోసం ఒక్కొక్క ప్రయాణికుడికి టికెట్ ధర రూ.12 వేలు ఆర్టీసీ నిర్ణయించింది.

అరుణాచల గిరిప్రదక్షిణ యాత్ర..

కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, కంచి, శ్రీకాళహస్తి పంచభూత లింగ క్షేత్రాల్లో ఒకటైన అరుణాచలం అగ్నిలింగ క్షేత్రం. పరమ పవిత్రమైన అరుణాచల గిరిప్రదక్షిణ సాక్షాత్తూ పరమ శివుని ప్రదక్షిణ అని భక్తుల విశ్వాసం. జీవితంలో ఒక్కసారైనా దర్శించుకోవాల్సిన పుణ్యక్షేత్రాల్లో ఇది ఒకటి. భక్తుల కోరిక మేరకు ఆర్టీసీ కాకినాడ డిపో ద్వారా పౌర్ణమి ముందురోజు అరుణాచలగిరి ప్రదక్షిణ యాత్రకు బస్సులు నడుపుతున్నారు. టిక్కెట్ ఒక్కొక్కరికీ రూ.3100గా ఉంది. అరుణాచలగిరి ప్రదక్షిణ యాత్ర బస్సులను గ్రూపుగా కూడా బుక్ చేసుకోవచ్చు.

ఒకేరోజులో పంచారామాల యాత్ర

కార్తీక మాసంలో ప్రత్యేక దర్శనాల కోసం ఆర్టీసీ పంచారామల టూర్ ప్యాకేజీని రూపొందించింది. కార్తీకమాసాన్ని శివునికి అత్యంత ప్రీతికరమైన మాసంగా చెప్తారు. అందుకే ఈ నెలలో ప్రముఖ శైవ క్షేత్రాలైన పంచారామాలను చాలామంది. దర్శిస్తుంటారు. ఈ క్షేత్రాలన్నీ మన రాష్ట్రంలోనే ఉండడం విశేషం. ఒకే రోజులో ఈ ఐదు ఆలయాలను కవర్ చేసేలా ఆర్టీసీ ఓ స్పెషల్ ప్యాకేజీని అందుబాటులో ఉంచింది. కాకినాడ బస్టాండ్ నుంచి రాత్రి 8 గంటలకు బస్సు బయలుదేరుతుంది. ముందుగా అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, చివరిగా సామర్లకోట దర్శనం జరుగుతుంది. అనంతరం ప్రయాణికులతో బస్సు మరుసటిరోజు రాత్రికి కాకినాడ డిపోకు చేరుతుంది. కార్తీకమాసంలో ప్రతి శని, ఆదివారాల్లో అనగా నవంబరు 2,3,9,10,16,17,23,24, 30, డిసెంబరు 1 తేదీల్లో బస్సు పంచారామ క్షేత్రాలకు బస్సు రాత్రి 8 గంటలకు బయలుదేరుతుంది. పంచారామ టూర్ టికెట్ ధరలు ఎక్స్‌ప్రెస్ రూ.910, అల్ట్రా డీలక్స్‌కు రూ.1120, సూపర్ లగ్జరీకి రూ.1160గా ఉన్నాయి.

పర్యటన ఇలా..

కాకినాడ నుంచి నేరుగా పంచారామాల్లో ఒకటమైన అమరావతికి ముందు వెళ్తారు. అక్కడి అమరలింగేశ్వర ఆలయాన్ని దర్శించుకుని అక్కడి నుంచి పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి వెళ్తారు. అక్కడ సోమేశ్వర ఆలయాన్ని దర్శించుకుంటారు. అనంతరం పాలకొల్లు బయలుదేరి వెళ్లి అక్కడి క్షీర రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకుంటారు. తర్వాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ద్రాక్షారామానికి బయలుదేరతారు. అక్కడ భీమేశ్వర ఆలయాన్ని దర్శించుకుంటారు. అక్కడి నుంచి చివరిగా కాకినాడ జిల్లా సామర్లకోటలోని కుమారభీమేశ్వర ఆలయాన్ని దర్శించుకున్న తర్వాత బస్సు కాకినాడ డిపోకి చేరుకోవడంతో యాత్ర ముగుస్తుంది. ప్యాకేజీలో భాగంగా కేవలం బస్సు ప్రయాణం మాత్రమే ఉంటుంది. ఆహారం, అక్కడి ఎంట్రీ టికెట్లు వంటివి యాత్రికులే చూసుకోవాలి.

టికెట్ బుకింగ్ ఇలా..

ప్రత్యేక బస్సులకు టికెట్‌లను కాకినాడ బస్ డిపోలో, ఆన్‌లైన్‌లో, ఆథరైజ్డ్ ఏజెంట్ల వద్ద ముందుగా పొందవచ్చు. భక్తులు బస్సు సరిపడా ఉండి కోరితే కావాల్సిన ప్రదేశానికి బస్సులు నేరుగా కూడా పంపుతారు. అద్దె ప్రాతిపదికన కూడా మొత్తం బస్సును బుక్ చేసుకునే అవకాశం ఉంది. ఆయా బస్సుల రిజర్వేషన్ కోసం 9959225564, విచారణ కోసం 9959225543 నెంబర్లను సంప్రదించవచ్చు.

తుఫాన్ ప్రభావంతో తొమ్మిది సూపర్ ఫాస్ట్

ఎక్స్‌ప్రెస్ రైళ్ల రద్దు

సామర్లకోట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల తీరప్రాంతాలలో మరికొద్ది గంటలలో రానున్న డానా తుపాన్ కారణంగా విశాఖ నుంచి విజయవాడ వైపు రాకపోకలు సాగించే పలు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్ళను 23, 24 తేదీల్లో రద్దు చేసినట్లు మంగళవారం సామర్లకోట రైల్వే ఉన్నతాధికారు లకు సమాచారం అందింది. అధికారుల నుంచి ఆంధ్రజ్యోతి సమాచారాన్ని సేకరించింది. హౌరా-ఫలక్‌నుమా మధ్య నడిచే (12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, సిల్చార్-సికింద్రాబాద్ మధ్య నడిచే (12514) ఎక్స్‌ప్రెస్‌లు ఈ నెల 23న రద్దయ్యాయి. ఖర్గపూర్-విల్లుపురం మధ్య నడిచే (22603) ఎక్స్‌ప్రెస్, షాలీమార్- హైద రాబాద్ మధ్య నడిచే (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, హౌరా-బెంగుళూరు మధ్య నడిచే (12863) ఎక్స్‌ప్రెస్, షాలీమార్- వాస్కోడిగామా మధ్య నడిచే (18047) ఎక్స్‌ప్రెస్, హౌరా-చెన్నై మధ్య నడిచే (12839) మెయిల్ ఎక్స్‌ప్రెస్, పాట్నా-ఎర్నాకుళం మధ్య నడిచే (22644) ఎక్స్‌ప్రెస్, సత్రాగంచి-చెన్నై మధ్య నడిచే (06090) ఎక్స్‌ప్రెస్‌లు 24న రద్దయ్యాయి. ఆయా రైళ్ళల్లో రిజర్వేషన్‌తో ప్రయాణించేవారు ఆయా తేదీలలో రద్దు సమయాలను పరిశీలిం చుకుని తమ ప్రయాణాలను మార్పులు చేసుకోవాలని అధికారులు సూచించారు. రద్దు అయిన రైళ్ళ వివరాలు, రిజర్వేషన్ టిక్కెట్ల రుసుములు చెల్లించడం వంటి సమాచారం సమీప రైల్వే స్టేషన్ బుకింగ్ కార్యాలయాల వద్ద సంప్రదించాలని రైల్వే ఉన్నతాధికారులు ఆ సమాచారంలో తెలిపారు.

పాదగయ ఈవోగా జగన్మోహన శ్రీనివాస్ బాధ్యతల స్వీకారం


బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్

పిఠాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రం సహాయ కమిషనరు, కార్యనిర్వహణాధికారిగా కాట్నం జగన్మోహన శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. శనివారమే జాయినింగ్ రిపోర్టు ఇచ్చిన ఈయన మంగళవారం ఇప్పటి వరకు ఈవోగా పనిచేసి తుని లోవ దేవస్థానం డిప్యూటీ కమిషనరు, ఈవో పి.విశ్వనాథరాజు నుంచి చార్జి తీసుకున్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని ఈవో తెలిపారు. ఈయన ప్రస్తుతం రాజమహేంద్రవరం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, పెద్దాపురం మహారాణి సత్రం ఇన్‌చార్జి ఈవోగా పని చేస్తున్నారు. పాదగయ ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈయన గతంలో పెనుకొండ వాసవికన్యకాపరమేశ్వరి దేవస్థానం, చదలవాడ వేంకటేశ్వరస్వామి దేవస్థానం (తొలి తిరుపతి) ఈవోగా పనిచేశారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా టెన్నిస్ జట్ల ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కాకినాడ అర్బన్, అక్టోబరు 22: కాకినాడలోని జిల్లా క్రీడా మండలి మైదానంలో మంగళవారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా టెన్నిస్ అండర్-17, 19 విభాగాల్లో బాలబాలికల జట్లను ఎంపిక చేసినట్టు కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి టి.రామ్‌కుమార్, పీఈటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.రవిరాజు, కోశాధికారి రవిసుందర్‌కౌర్, సహాక కార్యదర్శులు జి.సునీల్‌కుమార్, కె.పరుశురామ్, అండర్-19 కార్యదర్శి రత్న శామ్యూల్, పీడీలు మంగాయమ్మ, బీటీ వర్మ, వి.నీలిమ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌కు....

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలని కాకినాడ జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, వెల్డర్... కాకినాడ జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, వెల్డర్, తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటారు మెకానిక్ ట్రేడ్స్‌లో ఖాళీలు ఉన్నాయి. ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. నవంబరు 8న సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుంది. ఒక జిల్లాలో సంబంధిత ట్రేడ్లలో ఖాళీలు లేకపోతే వేరే జిల్లాలో పని చేసేందుకు అంగీకార పత్రం రాసి ఇవ్వాలి. మరిన్ని వివరాలకు 08922-294906 నెంబరును సంప్రదించవచ్చు.

ఐటీఐల్లో ప్రవేశానికి...

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని ప్రభుత్వ ఐటీఐలు, కాకినాడ, జగ్గంపేటల్లోని ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశానికి 5వ విడత నోటిఫికేషన్ విడుదలైంది. ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న అభ్యర్థులు దగ్గరలోని ప్రభుత్వ, ప్రయివేట్ ఐటీఐల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆన్‌లైన్ నమోదు పత్రాలతో హాజరై ఈ నెల 27వ తేదీలోపు వెరిఫికేషన్ చేసుకోవాలని కాకినాడ జిల్లా కన్వీనర్ ఎంవీజీ వర్మ సూచించారు. వెరిఫికేషన్ చేయించుకోని అభ్యర్థులు మెరిట్ జాబితాకు పరిగణించమని చెప్పారు.


సిల్టును తొలగిస్తున్న దృశ్యం

పాదగయ పుష్కరిణిలో సిల్టు తొలగింపు

పిఠాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ పుష్కరిణిలో సిల్టు తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. మహాలయ అమావాస్య పర్వదినాల సమయంలో పిండ ప్రదానాలు నిర్వహించి వాటిని పుష్కరిణిలో కలపడం వలన నీరు రంగు మారడంతో పాటు అందులో వ్యర్థాలు ఉండిపోయాయి. దీంతో నీటిని తొలగించారు. ఈలోగా దసరా శరన్నవరాత్రులు ప్రారంభం కావడంతో అమ్మవార్ల తెప్పోత్సవం కోసం మరలా నీరు పెట్టారు. పుష్కరిణిని శుభ్రం చేయకుండానే నీరు పెట్టడంతో రంగు మారింది. తెప్పోత్సవం ముగియగానే నీటిని పూర్తిగా తొలగించారు. నవంబరు 2వ తేదీ నుంచి కార్తీక మాసం ప్రారంభం కానున్న



నేపథ్యంలో పుష్కరిణిని శుభ్రం చేయాలని నిర్ణయించారు. 40 మంది కార్మికులను వినియోగించి రెండు రోజులుగా పుష్కరిణిలో సిల్టును తొలగించి ట్రాక్టర్ల సహాయంతో తరలిస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో పనులు పూర్తవుతాయని ఆలయ పూర్వ సహాయ కమిషనరు పి.విశ్వనాథరాజు, ప్రస్తుత ఈవో కేజేఎం శ్రీనివాస్ తెలిపారు. పూర్తిగా బురద తొలగించి కొత్త నీరు పెడతామని వారు చెప్పారు.


2013లో ఆత్మహత్య చేసుకున్న కిరణ్ కుటుంబ సభ్యులు (పాత చిత్రం)

వ్యాపార లావాదేవీలతో ఎంతో ఉన్నతంగా బతికి వందలాది మందికి జీవనోపాధి కల్పించిన ఆ కుటుంబం నేడు ఛిన్నాభిన్నమైంది. ఆర్థిక సమస్యలో, ఆరోగ్య సమస్యలో తెలియదు గానీ ఆ కుటుంబంలోని వారు వరుసగా ఆత్మహత్యకు పాల్పడుతుండడం సంచలనమైంది. 2013లో కుమారుడు, కోడలు, మనుమలు ఆత్మహత్య చేసుకున్నారు. నేడు తల్లిదండ్రులు ఆత్మహత్యకు పాల్పడ్డారు.


మంగళవారం ఆత్మహత్య చేసుకున్న రాంబాబు-నాగమణి దంపతులు (పాత చిత్రం)

కష్టాలే కడతేర్చాయా!

» 11 ఏళ్ల కిందట కొడుకు, కోడలు, మనుమల ఆత్మహత్య... నేడు తల్లిదండ్రులు » అంబాజీపేటలో విషాదఛాయలు

అంబాజీపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట పెద్ద వీధికి చెందిన పాబోలు రామసుబ్రహ్మణ్యం, కుమారుడు వెంకటకిరణ్ 2010కి ముందు అంబాజీపేటలో ఆయిల్‌మిల్లు ఏర్పాటు చేశారు. లాభాలు ఆర్జించి ఎంతో మందికి ఉపాధి కల్పించారు. అదే సమయంలో అయినవిల్లి మండలం సిరిపల్లిలో సుబ్రహ్మణ్యేశ్వర ఆగ్రో ప్రొడక్ట్స్ పేరుతో కొబ్బరి నూనె వ్యాపారం చేసేందుకు, ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. అయితే అందుకు స్థానికులు అభ్యంతరం తెలిపారు. నెలల తరబడి నిరసన తెలిపి ధర్నాలు చేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ వారు ఫ్యాక్టరీని ప్రారంభించారు. అయితే తీవ్ర నష్టాలు రావడంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంది. అప్పటి నుంచీ తీవ్ర సమస్యలతో సతమతమవుతోంది. దీంతో కుమారుడు కొన్ని ఆస్తులను విక్రయించేందుకు చర్యలు చేపట్టాడు. అయినా ఆర్థికంగా కోలుకోలేక పోయారు. 2013 అక్టోబరు 10న తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఓ హోటల్‌లో పాబోలు రాంబాబు కుమారుడు వెంకటకిరణ్, కోడలు లక్ష్మీశ్వేత, మనుమరాలు శ్రావణి, తొమ్మిది నెలల మనుమడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆ నాటి నుంచీ మనోవేదనకు గురైన రాంబాబు-నాగమణి దంపతులు కుమార్తె సాయంతో జీవిస్తున్నారు. అంబాజీపేట పెద్ద వీధిలో ఆదిత్య గార్మెంట్స్ షాపు పెట్టి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ వ్యాపారంలోనూ నష్టాలు వచ్చాయి. కోవిడ్ సమయం నుంచీ ఆర్థిక ఇబ్బందులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న రాంబాబు-నాగమణి దంపతులు మంగళవారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ పరిణామం స్థానికులను కలిచి వేసింది. బంధుమిత్రులు కన్నీరుమున్నీరయ్యారు.


గుమ్మళ్ళదొడ్డిలో నిరవధిక నిరాహార దీక్ష చేపట్టిన కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి శివగణేష్, ప్రధాన రహదారిపై బైఠాయించిన స్థానికులు

అస్సాగో ఇథనాల్ పరిశ్రమను తొలగించాల్సిందే

» గుమ్మళ్ళదొడ్డిలో నిరవధిక దీక్షకు దిగిన శివగణేష్, సూర్యచంద్ర » ప్రధాన రహదారిని దిగ్బంధించిన ప్రజలు

గోకవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డి సమీపంలో నిర్మించిన కాలుష్య కారకమైన అస్సాగో ఇథనాల్ పరిశ్రమను వెంటనే తొలగించాలని కోరుతూ మంగళవారం కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్, సామాజిక సేవా కార్యకర్త పాటంశెట్టి సూర్యచంద్ర స్థానికులతో కలిసి నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. గుమ్మళ్ళదొడ్డిలోని రామాలయం వద్ద చేపట్టిన దీక్షకు గుమ్మళ్ళదొడ్డి, అచ్యుతాపురం, బావాజీపేట, వెదురుపాక గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు ప్రకటించారు. జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. శివగణేష్, సూర్యచంద్ర మాట్లాడుతూ నివాస గృహల మధ్య కాలుష్య కారకమైన పరిశ్రమను ఏవిధంగా ఏర్పాటు చేశారో ప్రజలకు వివరించాలని డిమాండు చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా పరిశ్రమను స్థాపించి అనారోగ్యంపాలు చేస్తారా అని ప్రశ్నించారు. జనావాసాల మధ్య పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం ఎలా అనుమతి అచ్చిందో అర్థం కావట్లేదన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా పలుమార్లు ఉన్నతాధికారులను వివరాలు అడిగినప్పటికీ కనీస సమాచారం ఇవ్వలేదన్నారు. గ్రామం నుంచి పరిశ్రమను తరిమికొట్టే వరకు దీక్ష కొనసాగుతుందన్నారు. తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ కాలుష్యకారక పరిశ్రమను జనసేన ప్రోత్సహించదన్నారు. ఈ విషయాన్ని తమ అధినాయకుడి దృష్టికి తీసుకెళ్తానన్నారు. చుట్టూ చమురు కంపెనీలు ఉండగా మధ్యలో అత్యంత ప్రమాదకరమైన ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు హేయమైన చర్య అన్నారు. అస్సాగో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ స్థానికులు ప్రధాన రహదారిని దిగ్బంధించారు. రాజమహేంద్రవరం వైపు వెళ్లే వాహనాలు, రంపచోడవరం వైపు వచ్చే వాహనాల రాకపోకలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పోలీసులు జోక్యం చేసుకుని నచ్చజెప్పడంతో ఆందోళన కారులు ప్రధాన రహదారిపై నుంచి దీక్షా శిబిరం వద్దకు వెళ్లిపోయారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న రావులపాలెం సీఐ విద్యాసాగర్, స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

ఆలమూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడలో ఈ నెల 15న జరిగిన దొంగతనం కేసును పోలీసులు చేధించారు. ఆలమూరు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్‌ఐ ఎం.అశోక్ వెల్లడించారు. జొన్నాడకు చిటికెన సోమరాజు ఇంట్లో 312 గ్రాముల బంగారు వస్తువులను దొంగిలించిన పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన పందిరి వెంకటనారాయణ అలియస్ నారిగాడు, నెల్లూరు జిల్లాకు చెందిన మహబూబ్ బాషాలను మంగళవారం జొన్నాడ సెంటర్లో అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 121 గ్రాముల బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన వస్తువులను నెల్లూరు జిల్లాలో తాకట్టు పెట్టినట్టు గుర్తించారు. త్వరలోనే వాటిని తీసుకొస్తామన్నారు. కేసును చేధించడానికి కొత్తపేట డీఎస్పీ గోవిందరావు, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్‌ఐ ఎం.అశోక్, హెచ్‌సీ డి.సుబ్రహ్మణ్యస్వామి, సిబ్బంది ఎస్.బ్లెసన్, పి.గంగాధర్, కె.రాంబాబు, బి.నెహ్రూ, బి.శ్రీనివాసరావు, కేవీవీ రవికుమార్, వి.చిట్టిబాబు కృషి చేశారు.

భీమవరానికి చెందిన పందిరి వెంకటనారాయణపై రాష్ట్రంలోని పలు జిల్లాల్లో 60 దొంగతనం కేసులు నమోదై ఉన్నాయి. చాలా కేసుల్లో జైలుకు వెళ్లాడు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో వున్న సమయంలో వెంకటనారాయణకు రాజ నెల్లూరు జిల్లాకు చెందిన మహబూబ్ బాషాతో పరిచయం ఏర్పడింది. జైలు నుంచి విడుదలయ్యాక వారిద్దరూ కలిసి ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి చోరీలకు పాల్పడేవారు. జొన్నాడలో దొంగతనం జరిగిన ఇంటి వద్ద సీసీ కెమెరాలు లేవు. అయితే పరిసరాల్లోని సీసీ ఫుటేజీ ద్వారా వీరిని గుర్తించి పట్టుకున్నట్టు సీఐ విద్యాసాగర్, ఎస్‌ఐ అశోక్ తెలిపారు.


హరినాథ్-ఉదయలక్ష్మి దంపతులు (పాత చిత్రం)

మరణంలోనూ... ఒక్కటిగానే...

భర్త మరణించిన రెండు గంటల్లోనే భార్య మృతి... ఇంద్రపాలెంలో అలుముకున్న విషాదం

కాకినాడ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వాళ్లిద్దరూ వృద్ధ దంపతులు. సుమారు ఐదు దశాబ్దాలకు పైగా కలిసి జీవితం పంచుకున్నారు. వీరి అన్యోన్య దాంపత్య జీవితంలో ఇద్దరు కుమారులు, కోడల్లు, మనవళ్లతో ఏ చీకూచింతా లేకుండా వృద్ధాప్యంలో హాయిగా జీవితం గడచిపోతోంది. వృద్ధాప్యంలో సంభవించే అనారోగ్య రుగ్మతలతో భర్త ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మరణించగా, ఆయన మరణాన్ని తట్టుకోలేక భార్య కూడా గుండెపోటుతో కుప్పకూలిపోయి ప్రాణాలు విడిచింది. ఈ ఘటన కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెంలో జరిగింది. ఇంద్రపాలెం గౌరీకేదారేశ్వర స్వామి ఆలయం సమీపంలో నివాసం ఉంటున్న అరిగెల హరినాథ్ (78), అరిగెల ఉదయలక్ష్మి(72) భార్యభర్తలు. వీరికి సాయివెంకటేశ్వరరావు (బాబీ), విశ్వేశ్వరరావు (చిన్ని) కుమారులు. ఇద్దర్నీ పెంచి ప్రయోజకులను చేశారు. కోడళ్లు, మనవళ్లు, మనవరాళ్లతో ఆనందంగా జీవిస్తున్నారు. వృద్ధాప్యంలో పలు రకాల అనారోగ్య రుగ్మతలతో బాధపడుతున్న హరినాథ్ సోమవారం రాత్రి మరణించాడు. తండ్రి మృతదేహాన్ని ఆసుపత్రి నుంచి ఇంటికి తీసుకొచ్చి ఫ్రీజర్‌లో పెట్టారు. ఇది చూసిన భార్య ఉదయలక్ష్మి తీవ్రంగా కుంగిపోయింది. కుమారులు, కోడళ్లు, బంధువులు బాధపడొద్దు అంటూ వారించారు. భర్త మరణాన్ని తట్టుకోలేక ఫ్రీజర్‌లో ఉన్న భర్త భౌతికకాయాన్ని చూస్తూనే రెండు గంటల వ్యవధిలోనే భార్య తనువు చాలించింది. తల్లిదండ్రులిద్దరూ ఒకేసారి మృతి చెందడంతో కుమారులు సాయివెంకటేశ్వరరావు (బాబీ), విశ్వేశ్వరరావు (చిన్ని) కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎంతో అన్యోన్యంగా జీవితాంతం ఆనందంగా గడిపిన తల్లిదండ్రులు ఇలా రెండు గంటల వ్యవధిలోనే మృతి చెందారని కుమారులు తెలిపారు.


అవార్డు అందుకుంటున్న మణికుమార్

మణికుమార్‌కి 'ఆంధ్రరత్న' పురస్కారం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన నాదస్వర కళాకారుడు తొనంగి మణికంఠకుమార్ 'ఆంధ్రరత్న' పురస్కారం అందుకున్నారు. విజయవాడలో ఆయనకు అన్నమయ్య జిల్లా మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్, కన్నడ నటి పంకజ అవార్డు చేశారు. ఈ సందర్భంగా మణికంఠను నగరంలోని సుబ్బారావు నగర్‌లో గల ఆయన స్వగృహంలో నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. కోనంగి రామారావు, పెద్దసాయిబాబా, బర్రే కొండబాబు, గారెడ పైడిరాజు, విజనగిరి బంగారు రాజు అభినందించారు.


నార్కెడిమిల్లి వద్ద గోదావరిలో గాలింపు చర్యలు, ఇన్‌సెట్‌లో గల్లంతైన అభిషేక్ (పాత చిత్రం)

గోదావరిలోకి జారి బాలుడి గల్లంతు

ఆత్రేయపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం నార్కెడిమిల్లి శివారు శెట్టిబలిజపాలేనికి చెందిన 13 ఏళ్ల పిల్లి అభిషేక్ ఆదివారం సాయంత్రం సహచర మిత్రులతో కలిసి గోదావరి వద్దకు మలవిసర్జనకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారడంతో అభిషేక్ గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న స్థానికులు మూడు రోజులుగా గాలిస్తున్నారు. అభిషేక్ 8వ తరగతి చదువుతున్నాడు. తండ్రి మూడేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. ఒక్కగానొక్క కుమారుడిని ప్రయోజకుడిని చేయాలనే తలంపుతో తల్లి నాగలక్ష్మి అప్పు చేసి 21 రోజుల క్రితమే దుబాయ్ వెళ్లింది. కొడుకు గల్లంతయ్యాడన్న సమాచారంతో హుటాహుటిన అక్కడి నుంచి తిరిగి వచ్చింది. అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకు జాడ తెలియకపోవడాన్ని జీర్ణించుకోలేకపోతోంది. బిడ్డ కోసం ఆ తల్లి పడిన వేదన స్థానికులను కలచివేసింది.

భర్త మందలించాడని ఆత్మహత్య

పిఠాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. భర్త మందలించడంతో ఆత్మహత్యకు పాల్పడినట్టు భావిస్తున్నారు. ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్న పిఠాపురానికి చెందిన అనసూరి దుర్గాప్రసాద్, నర్సీపట్నానికి చెందిన నాగలక్ష్మి(28)కి 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరు పట్టణంలోని హెచ్‌పీ కంపెనీ సమీపంలోని అద్దె ఇంటిలో నివాసముంటున్నారు. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి ఆటోతో వెళ్లిన దుర్గాప్రసాద్ మధ్యాహ్న భోజనానికి ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో నాగలక్ష్మి ఫోన్ మాట్లాడుతూ పట్టించుకోకపోవడంతో దుర్గాప్రసాద్ మందలించాడు. కోపంతో కేకలు వేసి తిరిగి బయటకు ఆటోతో వెళ్లిపోయాడు. తిరిగి వచ్చేసరికి తలుపులు వేసి ఉండడంతో అనుమానం వచ్చి బద్దలుకొట్టి లోపలకు వెళ్లగా నాగలక్ష్మి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉంది. వివాహిత తమ్ముడి ఫిర్యాదు మేరకు పిఠాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్‌ఐ మణికుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పెనుగుదురు ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం

జనసైనికుల వేధింపులే కారణమంటున్న బాధితురాలి భర్త


కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఫీల్డ్ అసిస్టెంట్ సునీత

కరప, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పెనుగుదురు ఫీల్డ్ అసిస్టెంట్ పనిచేస్తున్న పులపకూర సునీత మంగళవారం ఉదయం నిద్రమాత్రలు, బైల్స్ గమ్ సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకుంటోంది. స్థానిక జన సైనికుల వేధింపులే దీనికి కారణమని ఆమె భర్త వీరబాబు ఆరోపిస్తున్నాడు. బాధితులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా కరప మండలం పెనుగుదురు ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సునీతపై మూడు నెలలుగా స్థానిక జనసేన నాయకులు వేధింపులకు పాల్పడుతున్నారు. ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బండారు మురళి, గ్రామ కమిటీ అధ్యక్షుడు గంటా నానిబాబు, వీరమహిళ గుబ్బల భవానీ తదితరులు ఫీల్డ్ అసిస్టెంట్ సునీతను తప్పించి తమకు కావాల్సిన వ్యక్తిని నియమించుకోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ప్రతినెలా తమకు డబ్బులు ఇవ్వాలని, లేకపోతే ఉద్యోగం లేకుండా చేస్తామని సునీతను అసభ్య పదజాలంతో బెదిరించారని ఆమె భర్త వీరబాబు ఆరోపించాడు. ఈ ఘటనకు బాధ్యులైనవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని అతను డిమాండ్ చేశాడు. తమపై వస్తున్న ఆరోపణలను జనసేన నాయకులు బండారు మురళి, గంటా నానిబాబు ఖండించారు. ఆమెను డబ్బులు డిమాండ్ చేసినట్టు, అసభ్యంగా మాట్లాడినట్టు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ సునీత పలు అవకతవకలకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. దీనిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు, ఉపాధి కూలీల సంతకాలతో కూడిన ఫిర్యాదు పత్రాన్ని ఈనెల 5వ తేదీన డ్వామా పీడీ, కరప ఏపీవోలకు అందజేశామన్నారు. రెండు రోజుల్లో అధికారులు దీనిపై విచారణకు రానున్నారని వారు చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కరప ఎస్‌ఐ తోట సునీత చెప్పారు.

వృద్ధులకు ఉచిత షుగర్ పరీక్షలు

సర్పవరం జంక్షన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈశ్వరనగర్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ ఆశ్రయ వృద్ధుల సంక్షేమ ఆశ్రమంలో మంగళవారం లయన్స్ క్లబ్ కాకినాడ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో వృద్ధులకు షుగర్ పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర ఐడీఏ కన్వీనర్ డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, లయన్స్ అధ్యక్షుడు బీరవికుమార్, బీవీఎస్‌రెడ్డి, వీరభద్రరావు పాల్గొన్నారు.

ప్రజలకు తీరని ద్రోహం చేసిన జగన్

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ



సమావేశంలో మాట్లాడుతున్న వర్మ

పిఠాపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతితో పాటు యువత, అన్నివర్గాల ప్రజలకు మాజీ సీఎం జగన్ తీరని ద్రోహం చేశారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం, డిప్యూటీ సీఎంపై విమర్శలు చేసిన మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై ఫైర్ అయ్యారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వర్మ మాట్లాడుతూ రాజధాని అమరావతి నిర్మాణాల కోసం నాడు చంద్రబాబు, ప్రధాని నరేంద్ర మోదీ ఇదే రోజు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. రాజధానిలో పలు నిర్మాణాలు చేపట్టారని, అయితే అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమరావతిని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులు, పోరాటం చేసిన మహిళలపై అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. విశాఖలో మాత్రం రూ.600కోట్లుతో విలాసవంతమైన భవనాన్ని జగన్ కట్టుకున్నారని, విలువైన భూములను వైసీపీ నేతలు కబ్జా చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజధాని అమరావతి నిర్మాణం కోసం కేంద్రం నుంచి రూ.15 వేల కోట్లు తీసుకువచ్చారని తెలిపారు. ఇప్పటికే ఇక్కడ పనులు ప్రారంభించారని, త్వరలోనే అన్ని కొలిక్కి వస్తాయని చెప్పారు. తన స్థాయిని మరిచి మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ వాఖ్యలు చేస్తున్నారని వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్‌సిక్స్ పథకాలపై మాట్లాడే అర్హత లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌పై తొలి సంతకం చేశారని, పింఛన్ రూ.4వేలుకు పెంచారని తెలిపారు. దీపావళి నుంచి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభం కానున్నదని చెప్పారు. జగన్ పాలనలో ఒకసారి డీఎస్సీ నిర్వహించకుండా, ఉద్యోగాలు భర్తీ చేయకుండా యువతను మోసం చేశారని విమర్శించారు. వైసీపీ నాయకులు అందరూ దొంగలేనని, దళిత డ్రైవర్‌ను ఎమ్మెల్సీ హత్య చేసి డోర్ డెలివరీ చేశారని, మాస్కులు గురించి ప్రశ్నించిన దళిత డాక్టర్‌ను వేధించి అతడి మృతికి కారణమయ్యారని ఆరోపించారు. సమావేశంలో టీడీపీ నాయకులు కొండేపూడి ప్రకాష్, మడికి ప్రసాద్, నల్లా శ్రీను, అల్లవరపు నగేష్, సకుమళ్ల నాగబాబు, కొరుప్రోలు శ్రీను, నూతాటి ప్రకాష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇక్కట్లు తప్పేదెన్నడో!

కాకినాడ, సామర్లకోటలో వాహనదారులకు తప్పని ఇబ్బందులు



కాకినాడ సుబ్బయ్యహోటల్ సెంటర్‌లో ట్రాఫిక్



సామర్లకోటలో ఓవర్‌బ్రిడ్జిపై నిలిచిపోయిన వాహనాలు

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని రామారావుపేటలో ఉన్న సుబ్బయ్యహోటల్ సెంటర్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. జడ్పీ నుంచి ముత్తా గోపాలకృష్ణ వారధి మీదుగా సర్పవరం జంక్షన్‌కు వెళ్లే వాహనాలు ఈ దారిలోనే వస్తుంటాయి. ద్వారకానగర్, కొండయ్యపాలెం, భానుగుడి సెంటర్ నుంచి వచ్చే వాహనదారులు కూడా ఇటుగానే కాకినాడ జీజీహెచ్‌కు వెళ్తారు. కాకినాడ టూటౌన్‌కి సుబ్బయ్యహోటల్ ముందు నుంచి గాంధీనగర్‌కు వెళ్లే వాహనదారులు ఇలాగే వెళ్తుంటారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటలకు తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. 4రోడ్లు కూడలి కావడం, పైగా పెద్దఎత్తున భోజన హోటళ్లు ఉండడంతో రోడ్డుపైన పార్కింగ్‌వల్ల రోడ్డు ఇరుగ్గా తయారవుతోంది. దీనివల్ల ట్రాఫిక్ స్తంభించిపోయి వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అదే వర్షం వచ్చినప్పుడు చూస్తే రోడ్లు జలమయమై వాహనాలు వెళ్లేందుకు వీలులేకుండా పోతుంది. పైగా ఇక్కడ హోటల్‌కి వచ్చిన వారు, ఇతర ఆస్పత్రులకు వచ్చిన రోగులు రోడ్డుపైనే వాహనాల పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తీవ్రతరం అవుతున్నాయి. దీంతో కాకినాడ వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ 4 కూడళ్ల సెంటర్‌లో ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ట్రాఫిక్ జామ్ లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సామర్లకోట: సామర్లకోట మీదుగా వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుండడంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ఏడీబీ రోడ్డులో వందలాది వాహనాలు, కళాశాలల బస్సులు రోజూ ట్రాఫిక్‌లో నిలిచిపోతుండడంతో వాహనదారులకు తిప్పలు తప్పడంలేదు. అసలే పెద్దపెద్ద గోతులతో ఓవర్‌బ్రిడ్జితో వాహనాదారులు సతమతమవుతుంగా ట్రాఫిక్ పోలీసులు సరిగ్గా స్పందించక పోవడంతో వాహనాదారులే ట్రాఫిక్ నియంత్రణకు ఉపక్రమించాల్సివచ్చింది. పట్టణంలో 2 పోలీస్‌స్టేషన్లు, తగిన పోలీసు సిబ్బంది, అధికారులు ఉన్న ప్పటికీ సామర్లకోట బ్రిడ్జిపై ట్రాఫిక్ స్తంభనను ఏ అధికారీ నియంత్రించలేకపోతున్నారన్న ఆరోపణలు అనేకమున్నాయి. పోలీసుల నిర్లక్ష్యం కారణంగా నిత్యం వాహనదారుల ఇబ్బందులు తప్పడం లేదన్న ఆవేదనలు ప్రతీ వాహనదారుడిలోనూ ఉంది.

లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే కొండబాబు



మంత్రి లోకేశ్‌తో కొండబాబు

కాకినాడ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఇన్‌ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖా మంత్రి నారా లోకేశ్‌ను మంగళవారం అమరావతి సచివాలయంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాకినాడ నగరాభివృద్ధి తదతర అంశాలపై మంత్రితో కొండబాబు చర్చించారు.

రేపు కూటమి విస్తృత సమావేశం

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గురువారం ఉదయం 10 గంటలకు కాకినాడలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కాకినాడ సిటీ నియోజకవర్గ ఎన్డీఏ కూటమి విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాల్సిందిగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే కార్యాలయం నుంచి విడుదల చేసిన ఓ ప్రకటనలో కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి విజయం తథ్యం

ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజప్ప

పెద్దాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి విజయం తథ్యం అని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మంగళవారం స్థానిక పాతబస్టాండ్ సమీపంలో ఉన్న వెలమ సంక్షేమ భవనంలో నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి (బాబు), టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌తో కలిసి రాజప్ప పాల్గొన్నారు. రాజప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి ప్రజల్లో ఆదరణ బాగా పెరిగిందని, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి విజయం తథ్యం అన్నారు. రామస్వామి, జ్యోతుల నవీన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వానికి గుర్తింపు బాగా పెరిగిందన్నారు. ముందుగా గ్యాడ్యుయేట్లను గుర్తించి వారికి ఓటువచ్చేలా కూటమి శ్రేణులు కృషి చేయాలన్నారు. సమయం తక్కువగా ఉన్న కారణంగా ప్రతీ కార్యకర్త దీనిపై దృష్టిసారించాలన్నారు. అనంతరం నమోదు ప్రక్రియను పరిశీలించారు. కూటమి నేతలు విత్తనాల వెంకటరమణ, రాజాసూరిబాబురాజు, వ్యాపాడ చిరంజీవి, బొల్లా వెంకటరమణ పాల్గొన్నారు.

జనసైనికుల ఆందోళన

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ముద్రించిన కరపత్రంలో తమ నాయకుడి ఫోటో లేదని జనసైనికులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కరపత్రాలను చించేసి అప్పై విసిరేశారు. వెలమ సంక్షేమ భవనంలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన కార్యక్రమానికి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి (బాబు), టీడీపీ జిల్లా ఇన్‌చార్జి జ్యోతుల నవీన్ హజరయ్యారు. సమావేశంలో కూటమి నాయకుల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి సంబంధించి ముద్రించిన కరపత్రంలో తుమ్మల బాబు ఫోటో లేకపోవడంతో జనసైనికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా తమ నాయకుడికి ఇచ్చే గౌరవం, విలువ అంటూ సమావేశం నుంచి బయటకు వచ్చి నినాదాలు చేశారు. కరపత్రాలను చించేసి విసిరికొట్టారు. దీంతో రాజప్ప, తుమ్మల, నవీన్‌లు జనసైనికులతో మాట్లాడి వారికి సర్దిచెప్పగా వారు శాంతించారు.

దీపావళి దుకాణాల ఏర్పాటుకు అనుమతులు



దీపావళి దుకాణాల ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న తహశీల్దారు, ఫైర్ ఆఫీసర్

పిఠాపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పిఠాపురం శివారులోని బైపాస్ వైజంక్షన్ వద్ద గల ఆరుద్ర వెంచర్స్ స్థలంలో దీపావళి దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇస్తున్నట్టు తహశీలారు వీవీ గోపాలకృష్ణ, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రామకృష్ణరాజు తెలిపారు. వారు మంగళవారం సదరు స్థలాన్ని పరిశీలించారు. దుకాణాల ఏర్పాటుకు వీలుగా తాత్కాలిక అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దుకాణాలు ఏర్పాటు చేసేవారు అన్ని ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని, నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వారి వెంట ఆర్‌ఐ వెంకటేష్ తదితరులు ఉన్నారు.

జిమ్నాస్టిక్స్‌లో హిమవర్షిణి ప్రతిభ



హిమవర్షిణిని అభినందిస్తున్న హరిప్రసాద్

కాకినాడ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఈనెల 17 నుంచి 19 వరకూ గుంటూరులో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జిమ్నాస్టిక్స్ ఛాంపియన్‌షిప్‌లో కాకినాడ శ్రీచైతన్య జూనియర్ కళాశాల సీనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థిని పోతల హిమవర్షిణి ప్రతిభ కనబరచి సీనియర్ మహిళల విభాగంలో 3పతకాలు సాధించినట్టు ఏజీఎం ఎం.హరిప్రసాద్ తెలిపారు. సీనియర్ మహిళల విభాగంలో ఫ్లోర్ ఎక్సర్‌సైజ్, టేబుల్ వాల్ట్‌లో 2వెండి, ఆల్ రౌండ్ ఛాంపియన్‌షిప్‌లో ఒక కాంస్య పతకం మొత్తం 3పతకాలు కైవసం చేసుకుందన్నారు. అంతేకాకుండా డిసెంబరు 25 నుంచి జనవరి 5వరకూ గుజరాత్‌లోని సూరత్‌లో జరిగే జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. 3 పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన హిమవర్షిణిని హరిప్రసాద్, ప్రిన్సిపాల్స్ ఎం.మోహన్ కుమార్, బి.వినోద్, డీన్ ఎం.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ మణికంఠస్వామి అభినందించారు.

‘సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు’



సామర్లకోట: సభలో ప్రసంగిస్తున్న తహశీల్దార్

సామర్లకోట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలకు ప్రభుత్వం నిర్వహిస్తున్న రీసర్వే గ్రామ సభలను బాధితులు సద్వినియోగం చేసుకోవడం ద్వారా శాశ్వత పరిష్కారం పొందాలని సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి అన్నారు. మండలంలోని ఉండూరు గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ రెవెన్యూ ఆధ్వర్యంలో రీసర్వే గ్రామ సభలను నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ ప్రధానంగా భూసమస్యల్లో ఎల్పీఎం నందు కోరిలేషన్ సర్వే నంబరు, దస్తావేజులోని సర్వే నంబరు పరస్పరం విరుద్ధంగా ఉన్నవారు, తన భూమికి తనపేరు బదులు పక్క రైతు ఖాతాలో నమోదు కావడం, విడివిడిగా సబ్‌డివిజన్ చేయడం, జిరాయితీ భూమిలో ఇంటి స్థలం, లేఅవుట్‌గా నమోదు కావడం, తదితర సమస్యలకు చెంది పరిష్కారం పొందవచ్చని చెప్పారు. ఉండూరు గ్రామం నుంచి భూముల రికార్డుల నమోదులకు చెంది 27 అర్జీలు అందినట్లు తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ వై.శ్రీనివాస్, మండల సర్వేయర్ పి.సీతారామాచార్యులు, సర్వేయర్లు సీహెచ్.నరసింహమూర్తి, ఏ.సంజీవ్ భరత్, టి.సాయిరామ్, వీఆర్వోలు కె.చంద్రబాబు, ఆర్.కొండలరావు తదితర సిబ్బంది ఉన్నారు.

పెద్దాపురం: క్షేత్రస్థాయిలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గ్రామసభలను నిర్వహిస్తున్నట్టు తహశీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మీ అన్నారు. మండలంలోని సిరివాడలో నిర్వహించిన రెవెన్యూ గ్రామభలో ఆమె మాట్లాడుతూ ఎక్కడైనా రెవెన్యూ సమస్యలు ఎదురైతే వాటి పరిష్కారానికి కృషిచేయనున్నట్లు తెలిపారు. పలువురి నుంచి వినతులు స్వీకరించారు.

కరప: సిరిపురంలో రెవెన్యూ అధికారులు నిర్వహించిన రీ-సర్వే గ్రామసభకు రైతుల నుంచి అర్జీలు వెల్లువెత్తాయి. తహశీల్దార్ నందిపాటి సత్యనారాయణ సమక్షంలో జరిగిన సభకు రైతులు ఫిర్యాదులు అందజేశారు. జాయింట్ ఖాతాలు, భూ విస్తీర్ణం, మ్యుటేషన్‌లకు సంబంధించి 63 ఫిర్యాదులు వచ్చినట్టు తెలిపారు. సర్పంచ్ నున్న సుజాత వీరబాబు, రీసర్వే డీటీ డి.దుర్గాప్రసాద్, సర్వేయర్ ఎస్.రూపవతి పాల్గొన్నారు.

నేడు చొల్లంగిలో...

తాళ్లరేవు: మండలంలో జరగబోయే రెవెన్యూ గ్రామసభలను ప్రభుత్వధికారులంతా విజయవంతం చేయాలని తహశీల్దార్ పి.త్రినాద రావు కోరారు. బుధవారం చొల్లంగిలో రెవెన్యూ గ్రామసభ ప్రారంభమవుతుందన్నారు. రీసర్వేలో జరిగిన తప్పొప్పులు, భూసమస్యలపై సభలో రైతులంతా ఫిర్యాదులు చేసుకోవచ్చని తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా వరప్రసాద్



పవన్‌కల్యాణ్‌తో వరప్రసాద్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు22(ఆంధ్ర జ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బీఎస్ ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా జనసేన పార్టీ 2014లో నుంచి క్రియాశీలకంగా వ్యవహరించిన ఎలుచూరి వరప్రసాద్‌కు అవకాశం కల్పించారు. తనకు ఈఅవకాశం కల్పించిన పార్టీ అధినాయకుడు పవన్‌కల్యాణ్‌కు, ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, సివిల్ సప్లయ్స్ చైర్మన్ తోట సుధీర్, జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు, కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు వచ్చిన ఈ అవకాశాన్ని పార్టీకి వన్నెతెచ్చే విధంగా అందరిలోనూ మంచి గుర్తింపు తెచ్చుకుంటానని ఆయన చెప్పారు.

అడ్వైజరీ బోర్డు సభ్యుడిగా గట్టి



గట్టి రవి

కరప, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా టెలికాం అడ్వైజరీ బోర్డు సభ్యుడిగా గట్టి వెంకటేశ్వరరావు(రవి) నియమితులయ్యారు. న్యూఢిల్లీ భారత్‌సంచార్ నిగమ్ నుంచి ఈ మేరకు తనకు ఉత్తర్వులు అందినట్టు మంగళవారం ఆయన తెలిపారు. 2026 జూలై 13వరకు ఈ పదవిలో కొనసాగుతానని చెప్పారు. తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు. ఈ అవకాశం కల్పించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

తీరప్రాంత గ్రామాల ప్రజల అప్రమత్తం

కొత్తపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో తుఫాన్ ఏర్పడనున్న సమాచారంతో ఉప్పాడ తీరప్రాంత గ్రామాల ప్రజల అప్రమత్తయ్యారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత కొనసాగింది. సాయంత్రం 5గంటల దాటిన తర్వాత ఆకాశంలో మబ్బులు ఆవరించి చినుకులు రాలాయి. తుఫాన్ వచ్చే ముందు సముద్రం చాలాప్రశాంతంగా ఉంటుందని మత్స్యకారులు చెబుతున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి తీరప్రాంతంలో గాలి సముద్రం లోపలకు లాగేసుకుంటుందని, ఇలా గాలి లోపలకు లాగడంతో తుఫాన్ ఖచ్చితంగా వస్తుందని మత్స్యకారుడు ప్రసాద్ చెప్పాడు. ఉదయం వేటకు వెళ్లిన తాము సముద్రం లోపల పరిస్థితులు బాగోలేకనే త్వరగా ఒడ్డుకు చేరుకున్నామన్నాడు. బుధవారం పూర్తిగా తుఫాన్ కనిపిస్తుందని..బోట్లు, వలలు, ఇంజన్లు సురక్షిత ప్రాంతాలకుతరలించుకున్నామని చెప్పాడు.

ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణంపై అభ్యంతరం

సర్పవరం జంక్షన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వాకలపూడి ఎస్సీ పేటలో గల సామాజిక స్థలంలో అంగన్‌వాడీ సెంటర్‌కు వచ్చే చిన్నారులు ఆటలు ఆడుకుంటున్నారని ఈ స్థలంలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మాతా సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం స్థానిక జైభీమ్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో వాకలపూడి పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే స్థలంలో వైసీపీ హయాంలో వాటర్ ట్యాంకు నిర్మాణం కోసం ప్రయత్నిస్తే అడ్డుకోవడం జరిగిందన్నారు. స్థానికంగా మిగులు భూమి ఉండగా ఎస్సీ పేటలో ఉన్న కొద్దిపాటి స్థలంలోనే నిర్మాణానికి ముందుకు వెళ్లడం దారుణమన్నారు. ఈ స్థలంలో ట్యాంకు నిర్మిస్తే అంగన్‌వాడీ పిల్లలకు ఆడుకునేందుకు స్థలం లేకుండా పోతుందన్నారు. తక్షణం వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు ఇచ్చిన తీర్మానం వెనక్కి తీసుకోవాలని, లేదంటే న్యాయ పోరాటానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బీవీఎఫ్ జిల్లా కన్వీనర్ ప్రత్తిపాటి బుల్లిరాజు, స్థానిక గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కాకినాడ సూపర్ బజార్ చైర్మన్‌కు సత్కారం

కాకినాడ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సూపర్ బజార్ చైర్మన్ ప్రెసింగి ఆదినారాయణను ఆర్టీసీ కాంప్లెక్స్ రైతు బజార్ రైతు సంఘం నాయకులు సత్కరించారు. ఈ మేరకు మంగళవారం సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు ఆధ్వర్యంలో చైర్మన్ ఆదినారాయణను ఆయన ఛాంబర్‌లో కలిశారు. రమణరాజు చైర్మన్‌ను శాలుశాతో సత్కరించి అంబేడ్కర్ చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ నగరంలోని పెద్దల సలహాలు, సూచనలు స్వీకరించి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, పర్యావరణవేత్త బొలిశెట్టి సత్య, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీల సహకారంతో కూటమి ప్రతినిధుల ద్వారా సూపర్ బజార్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కాంప్లెక్స్ రైతు బజార్ రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.



సాహితీవేత్త సూర్యారావుకు సత్కారం



సూర్యారావును సత్కరిస్తున్న దృశ్యం

పోర్టు సిటీ (కాకినాడ), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాహితీవేత్త తురగా సూర్యారావును ప్రపంచ తెలుగు సాహితీ కళా జాతర సంస్థ ఘనంగా సత్కరించింది. ఇటీవల తాడేపల్లిగూడెంలో జరిగిన సంస్థ 140వ సాహితీ కార్యక్రమంలో భాగంగా శ్రీశ్రీ కళా వేదికపై నిర్వహించిన సదస్సులో సాగే జీవితం అనే కవితను చదివి వినిపించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు కత్తిమండ ప్రతాప్, కొల్లి రమావతి, టిపి పార్థసారథి, ఈశ్వరి తదితరులు ఘనంగా సత్కరించి మెమెంటో, ప్రశంసాపత్రం అందజేశారు. సత్కారం అందుకున్న సూర్యారావును రిటైర్డ్ పోస్టల్ ఉద్యోగ సంఘ నేతలు, సాహితీవేత్తలు అభినందించారు.

బెల్లం ఊట స్వాధీనం

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 22: గొల్లప్రోలు మండలం కొడవలిలో నాటుసారా కాస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. 200లీటర్ల బెల్లం ఊట, గ్యాస్ సిలిండర్, సారా కాసేందుకు ఉపయోగిస్తున్న రాగి తీగను స్వాధీనం చేసుకున్నారు. పిల్లా అంబేద్కర్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు తెలిపారు.

పోలీసు అమరవీరుల కుటుంబాలకు పరామర్శ



కుటుంబ సభ్యులకు పండ్లు అందిస్తున్న సీఐ

కాకినాడ క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో గల పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులను మంగళవారం పోర్టు సీఐ పి.సునీల్ పరామర్శించారు. కుటుంబ సభ్యుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు అమరవీరులు గంటిమిల్లి సత్యనారాయణ, కోటపాటి వీరగంగరాజు, దేవరాజు కుటుంబ సభ్యులను కలుసుకుని పండ్లు అందించడంజరిగిందని చెప్పారు.

మద్యం దుకాణంపై విచారణ

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలో యూటీఎఫ్ హోం పక్కనే ఉన్న మద్యం దుకాణం తొలగించాలని ప్రజా సంఘాలు, అంబేడ్కర్ సంఘాలు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు ఫిర్యాదు చేశాయి. ఈ నేపథ్యంలో ట్రైనీ కలెక్టర్ భావన మంగళవారం రాత్రి యూటీఎఫ్ హోం వద్ద పరిస్థితిపై విచారణ నిర్వహించారు. విచారణ నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని ఆమె వెల్లడించారు.

నాగులాపల్లిలో డీఎల్‌పీవో పరిశీలన

కొత్తపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థి కూనిశెట్టి అచ్చామణికి మంజూరు చేసిన పన్ను రశీదు గల ఇంటిని కాకినాడ డివిజనల్ పంచాయతీ అధికారిణి(డీఎల్‌పీవో) అన్నామణి మంగళవారం పరిశీలించారు. పన్ను రశీదు మంజూరుపై జరిగిన అన్యాయంపై అచ్చామణి సోదరుడు, కాకినాడ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు బిళ్లకుర్తి రామేశ్వరరెడ్డి పంచాయతీ రాజ్ కమిషనర్‌కు చేసిన ఫిర్యాదు చేశారు. దీంతో డీఎల్‌పీవో నాగులాపల్లిలో రశీదు గల ఇంటిని పరిశీలించారు. పన్ను రశీదు ఇచ్చిన ఇల్లు శిథిలావస్థలో ఉండడం, ఆ ఇంట్లో ఎవరూ లేకపోవడాన్ని డీఎల్‌పీవో గుర్తించారు. అదేవిధంగా 2012-13 పంచాయతీ రికార్డుల్లో అచ్చామణి మామ సుబ్బారావు పేరున ఇంటి పన్ను ఉన్నట్టు గుర్తించారు. ప్రస్తుత ఇంటి పన్ను రికార్డు అందుబాటులో లేకపోవడంతో విచారణ తాత్కాలికంగా వాయిదా వేశారు. డీఎల్పీవో వెంట కొత్తపల్లి ఈవోపీఆర్డీ సత్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.



ఇంటిని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

పిస్తోల్ షూటింగ్‌లో సత్తా చాటిన శ్రీసూర్యప్రణవ్



శ్రీసూర్యప్రణవ్

కాకినాడ అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ఇంటర్నేషనల్ పాఠశాలలో ఈనెల 20న నిర్వహించిన 68వ అంతర్ జిల్లాల పిస్తోల్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో కాకినాడ ఆదిత్య ఐఐటీ స్కూల్ విద్యార్థి గాదం శ్రీసూర్యప్రణవ్ సత్తా చాటాడు. అండర్ 17 విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచి బంగారుపతకం సాధించాడు. డిసెంబరులో భోపాల్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఉమ్మడి జిల్లా ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించాడు. ప్రణవ్‌ను తల్లిదండ్రులు, టీచర్లు అభినందించారు.

సమస్యలను పరిష్కరించాలి

తాళ్లరేవు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ప్రభుత్వాదికారులతంతా త్వరగా పూర్తిచేయాలని తహశీల్దార్ పి.త్రినాద రావు ఆదేశించారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, ఇరిగేషన్, సర్వేడిపార్ట్‌మెంట్ అధికారులతో ఆన్‌లైన్ పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. నీటిసంఘాల వివరాలు, భూసమస్యలు, కన్వర్షన్‌లు, ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు, ఎన్‌టి, అడంగుల్ల సమస్యలను తక్షణం పరిష్కరించే చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సూరిబాబు, సర్వేయర్ మహ్మద్ షఫీ, ఆర్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నేత ఆర్థిక సాయం

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడలో మరణించిన మహిళ పొన్నాడ నాగమణి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్ తెలిపారు. దుర్గాడలో ఆమె కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించి ఆర్థికసహాయాన్ని అందజేశారు. జనసేన నాయకులు కందా శ్రీనివాస్, మొగలి శ్రీను, జ్యోతుల సీతారాంబాబు, పోలం త్రిమూర్తులు, శేశెట్టి భద్రం తదితరులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది కార్యక్రమం

పెద్దాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపర్తి గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మండల వ్యవసాయధికారి కె.సంజయ్‌కుమార్ మాట్లాడారు. వరిసాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

సర్పవరం జంక్షన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సూర్యారావుపేట లైట్‌హౌస్ ప్రాంతానికి చెందిన దూడా దుర్గారావుకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.77,470లు చెక్కును మంగళవారం వలసపాకలలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి దంపతులు అందజేశారు.

స్టేజ్-2 వెరిఫికేషన్

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): చేతివృత్తిదారులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకానికి సంబంధించి కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో నమోదు చేసుకున్న చేతివృత్తి లబ్దిదారులను జిల్లా స్థాయిలో అప్రూవల్ చేయు నిమిత్తం స్టేజ్ 2 వెరిఫికేషన్ కార్యక్రమం ప్రారంభమైంది. నోడల్ ఆఫీసర్లు, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలు, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు బృందాలుగా ఏర్పాటై సోమ, మంగళవారాల్లో ఈ వెరిఫికేషన్ చేపట్టారు. బుధవారం వెరిఫికేషన్ నివేదికను కలెక్టరేట్‌లో అందజేస్తారు. కమిషనర్ భావన ఆదేశాలతో సర్కిల్ స్పెషల్ ఆఫీసర్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

సర్పవరం జంక్షన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నేమాంలో మంగళవారం సమాచార హక్కు చట్టం-2005పై రైతులకు మండల వ్యవసాయాధికారి చీకట్ల సత్యనారాయణ అవగాహన కల్పించారు. ఆర్టీఐ కింద ఏవిధంగా సంబంధిత అధికారికి ఎలా దరఖాస్తు చేయాలో, ఎటువంటి సమాచారం కోరవచ్చు, కోరిన సమాచారం సమగ్రంగా లేకపోతే ఏ విధంగా అప్పీలుకు వెళ్లవచ్చు అనే విషయాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఏఈవోలు మూర్తి, గౌడ్, పలువురు రైతులున్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

పిఠాపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగ్రహారం ప్రాంతానికి చెందిన రెడ్డి నాగవేణి(50) సోమవారం సాయంత్రం భర్త వీర వెంకట సత్యనారాయణతో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి బంధువుల ఇళ్లల్లో వెతికినా కనిపించకపోవడంతో మంగళవారం పోలీసులకు కుమారుడు రెడ్డి సురేష్ ఫిర్యాదు చేశాడు. ఆచూకీ తెలిస్తే 9491212553కి తెలియజేయాలని కోరారు.

చిన్నారి చదువుకు సాయం

కాకినాడ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డ్రైవర్స్‌కాలనీకి చెందిన ఎ.అప్పారావు ఇటీవల మరణించడంతో అతడి చిన్న కుమార్తె దీక్ష చదువుకు ఆటంకం ఏర్పడింది. ఈ విషయాన్ని శ్రీ యువసేన ద్వారా తెలుసుకున్న యుఎస్ఏలో మాస్టర్స్ చదువుతున్న నిజామాబాద్‌కు చెందిన ఇట్టిడి సాయిరెడ్డి ఈ విద్యా సంవత్సరం ఫీజు నిమిత్తం రూ.14 వేలు పంపారు. మొత్తాన్ని శ్రీ యువసేన అధినేత సతీష్ మంగళవారం చిన్నారితల్లికి అందజేశారు.



చిన్నారికి ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ

ప్రత్తిపాడు, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం సాయంత్రం పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు సందర్శించారు. బుధవారం ఏలూరు రేంజ్ డీఐజీ స్టేషన్ సందర్శించనున్న నేపథ్యంలో డీఎస్పీ స్థానిక పోలీస్‌స్టేషన్ పరిశీలించి సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతంలకు పలు సూచనలు చేశారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషదేవి

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

రంపచోడవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం నియోజకవర్గంలో టీడీపీని బలోపేతం చేయాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి నాయకులు, కార్యకర్తలకు సూచించారు. మంగళవారం ఆర్‌పీ ఫంక్షన్ హాల్లో ఆమె అధ్యక్షతన పార్టీ సభ్యత్వ నమోదుపై ఏడు మండలాల శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 26న ప్రారంభమయ్యే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలన్నారు. త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు డిగ్రీ పూర్తి చేసిన వారికి ఓట్లు నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, పలు మండల శాఖల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విభాగాల సభ్యులు పాల్గొన్నారు.



గండిపోశమ్మ అమ్మవారి ఆలయంలో దేవదాయ శాఖ అధికారి లక్ష్మీ సుధారాణి

గండిపోశమ్మ ఆలయం, పరిసరాల పరిశీలన

దేవీపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొందూరు గ్రామంలో వేంచేసి యున్న శ్రీగండిపోశమ్మ అమ్మవారి దేవాలయాన్ని దేవదాయ, ధర్మాదాయ శాఖ జిల్లా అధికారిణి కె.లక్ష్మీసుధారాణి మంగళవారం పరిశీలించారు. గోదావరి నీటిమట్టం, పరిస్థితులను, ఆలయం శుభ్రం చేసే పనులను చూసి పలు సూచనలు చేశారు. గోదావరి నీటిమట్టం ఇంకా అధికంగా, ప్రమాదకరంగా ఉన్న కారణంగా భక్తులను దర్శనానికి అనుమతించట్లేదన్నారు. తేదీలు ప్రకటించే వరకు ఆలయ పరిసరాల్లోకి ఎవరూ రావద్దన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల ముంపునకు గురవుతున్న అమ్మవారి ఆలయ పరిరక్షణ, అభివృద్ధిపై ఏపీ జెన్‌కో అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మోహన్‌తో మాట్లాడారు. అమ్మవారి ఆలయాన్ని పోలవరం ముంపు బారి నుంచి కాపాడి అభివృద్ధి చేయడంలో తాము తప్పక సహకరిస్తామని జెన్‌కో అధికారులు హామీ ఇచ్చారు. జూనియర్ అసిస్టెంట్ కె.వెంకటేశ్వరరావు, కార్యనిర్వహణాధికారి గంది వెంకటలక్ష్మీకుమార్, నాయకులు, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.



భూసార పరీక్ష పత్రాలు అందజేస్తున్న ఎంపీటీసీ వెంకటరమణ

మంగంపాడులో 'పొలం పిలుస్తోంది'

మోతుగూడెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం డొంకరాయి పరిధిలోని మంగంపాడు గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఆధునిక వ్యవసాయ, సమాచారం పరిజ్ఞానం, అనుబంధ శాఖల పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షల ద్వారా భూమిలో ఉన్న పోషకాలను తెలుసుకోవచ్చన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీటీసీ కరకా వెంకటరమణ భూసార పరీక్ష పత్రాలను రైతులకు అందజేశారు. అనంతరం వరి క్షేత్రాలను సందర్శించి జిల్లేడు, కాషాయం తయారీ విధానం, ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ సంధ్యారాణి, వార్డు సభ్యులు, మాజీ ఉప సర్పంచ్ గంగిరెడ్ల గురుమూర్తి, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎస్.సుష్మ, వెటర్నరీ అసిస్టెంట్ భద్రం, జెడ్‌డీఎన్‌ఎస్‌వీవోలు, ఐసీఆర్‌పీలు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.



మద్యం షాపు ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

'మద్యం షాపును వెంటనే తొలగించాలి'

వీఆర్ పురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రేఖపల్లి గ్రామంలో ప్రధాన రహదారి పక్కనున్న మద్యం షాపును వెంటనే తొలగించాలని భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి వి.పద్మ, రేఖపల్లి సర్పంచ్ (మహిళా సంఘం నాయకురాలు) పూనెం సరోజిని, చుట్టుపక్కల కుటుంబాల మహిళలు మద్యం షాపు ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. గ్రామం మధ్యలో మద్యం షాపును తొలగించాలంటూ తహసీల్దారు కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. ఈ క్రమంలో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి, ప్రార్థనా మందిరం, సాయిబాబా ఆలయం ఉన్న చోట మద్యం షాపు నిర్వహించడం ఎంతవరకు సబబు అని అన్నారు. మహిళల అవసరాల కోసం, విద్యార్థులు పాఠశాలలకు ఆ దారి వెంటే వెళ్లాలని, చుట్టుపక్కల కుటుంబాల వారు వ్యతిరేకిస్తున్నారు. అయినా కొంతమంది వైసీపీ పెద్దల సహకారంలో అదే ప్రాంతంలో ప్రారంభించామన్నారు. మద్యం షాపును అక్కడి నుంచి తక్షణం తొలగించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున మహిళా సంఘాలతో కలిసి ధర్నా నిర్వహిస్తామన్నారు. వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారు సరస్వతికి ఇచ్చారు. కార్యక్రమంలో రేవు గంగాభవాని, ముత్యాల గాయత్రి, రేవు సావిత్రి, వడ్డానపు లక్ష్మి, ముంజపు వెంకటరమణ, ముత్యాల వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

పిలుపునిచ్చిన కూటమి నాయకులు

జగ్గంపేట, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నాయకులు కోరారు. స్థానిక రావులమ్మనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ అధ్యక్షతన ఉభయ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ చిరంజీవిరాజు, ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, బీజేపీ ఇన్‌చార్జి దాట్ల కృష్ణ వర్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్ మాట్లాడుతూ జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి టీడీపీ కార్యకర్తలు పని చేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ చిరంజీవిరాజు మాట్లాడుతూ మీరందరూ కష్టపడి పనిచేసి రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జ్యోతుల నవీన్ మాట్లాడుతూ తాను జిల్లా అధ్యక్షుడిగా అయినప్పటి నుంచి తనకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించిన రాజశేఖర్ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ అప్పలరాజు, తోట రవి, తోట గాంధీ, మారిశెట్టి భద్రం, చదరం చంటిబాబు, కొత్త కొండబాబు, వీరంరెడ్డి కాశీబాబు, కందుల చిట్టిబాబు, అడపా భరత్, జంపన సీతారామచంద్రవర్మ, పైడిపాల సూరిబాబు, బొల్లంరెడ్డి రామకృష్ణ, పాలకుర్తి ఆదినారాయణ, బస్వ చిన్నబాబు పాల్గొన్నారు.



జగ్గంపేటలో మాట్లాడుతున్న జ్యోతుల నవీన్

విజయమే లక్ష్యం



ప్రత్తిపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): మార్చి నెలలో జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా, ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ రేపాడ చిరంజీవిరావు పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద మంగళవారం నియోజకవర్గంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత భాగస్వామ్యం కీలకమైందన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే, విద్యాకమిటీల ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మాదిరిగానే రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అభ్యర్థుల గెలిపే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఇందుకు గాను అప్పటి నుంచే డిగ్రీ పట్టభద్రులు నియోజకవర్గంలోని 10వేల మందికి తగ్గకుండా సభ్యత్వ నమోదు చేపట్టాలన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా పని చేయాలని కోరారు. ఎమ్మెల్సీ రేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ 2018పట్టభద్రుల ఓటర్ల జాబితాను పరిశీలించి, 2024 వరకు ఉన్న కొత్త ఓటర్లు నమోదు చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ఎంత ముఖ్యమో వారిని పోలింగ్‌లో పాల్గొనే విధంగా చేయడం అంతే ముఖ్యమన్నారు. సమావేశంలో జిల్లా టీడీపీ, బీజేపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కుమార్, చిలుకూరి రామ్‌కుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వత్సవాయి సూర్యనారాయణ రాజు(మీసాలరాజు), నియోజకవర్గ పరిశీలకులు ఈవీవీ సత్యనారాయణ, టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, యాళ్ళ జగదీష్, దాట్ల అప్పన్నబాబు, ఏక గంగ, అమరాది వెంకట్రావు, ఇంధన ఏసుబాబు ఉన్నారు.



కంపెనీ యాజమాన్యంతో మాట్లాడుతున్న జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్

అస్సాగో ఫ్యాక్టరీని పరిశీలించిన తుమ్మలపల్లి

జగ్గంపేట, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం గుమ్మలదొడ్డిలో అస్సాగో ఫ్యాక్టరీ నుంచి వచ్చే కాలుష్యం కారణంగా బాధిత గ్రామాలు చేస్తున్న ఆందోళనపై జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ మంగళవారం ఫ్యాక్టరీని పరిశీలించి యాజమాన్యంతో చర్చించారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే కాలుష్యం కారణంగా చుట్టుప్రక్కల గ్రామాల్లో ఉన్న ప్రజలు అనేక అనారోగ్య సమస్యలకు లోనవుతున్నారని, వెంటనే యాజమాన్యం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. యాజమాన్యం 10రోజులు సమయం అడిగారని, ఈ 10 రోజులు ప్రజల బాగోగులు చూసుకునే బాధ్యత కంపెనీ యాజమాన్యానిది అని తెలిపారు. సమస్య పరిష్కారం కాకపోతే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

రహదారులు నిర్మించాలని వినతి

ఏలేశ్వరం, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రహదారులు పున:నిర్మించాలని సీపీఐఎంఎల్ వినోద్ మిశ్రా పార్టీ నాయకులు మంగళగిరిలో జనవాణి కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. ఏలేశ్వరం మండలంలోని రమణయ్యపేట గ్రామం నుంచి జె.అన్నవరం గ్రామం వరకు గోతులతో అధ్వానంగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డును పునర్నిర్మించాలని జనవాణి కార్యక్రమానికి ఇన్‌చార్జిగా ఉన్న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీకి వినతి అందజేశారు. ఎమ్మెల్యే అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించి తక్షణం ప్రజలకు ఇబ్బందులు లేకుండా గోతులు పూడ్చాలని ఆదేశించారు. కొసిరెడ్డి గణేశ్వరరావు, దాడిశెట్టి వీరబాబు, రెడ్డి ఆనందపాల్ పాల్గొన్నారు.

'ప్రజాహక్కుల ర్యాలీని జయప్రదం చేయాలి'

ఏలేశ్వరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజా హక్కుల ర్యాలీని జయప్రదం చేయాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకుడు బుగతా బంగార్రాజు కోరారు. మంగళవారం పట్టణంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో బంగార్రాజు మాట్లాడుతూ డిసెంబరు 4న విజయవాడలో నిర్వహించే ప్రజా హక్కుల ర్యాలీకి ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో గూడపాటి అర్జునరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మాజీ మంత్రి యనమల



సమావేశంలో మాట్లాడుతున్న యనమల

తుని రూరల్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజామన్నలు పొందే నాయకులుగా ముందుకు సాగాలని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తేటగుంట టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా యనమల మాట్లాడుతూ శాసన మండలి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి విజయానికి సమష్టిగా పని చేయాలని కోరారు. వెనువెంటనే రానున్న సహకార సంఘాలు, నీటి సంఘాల ఎన్నికల్లోను నూరుశాతం ఫలితాలు సాధించే దశగా కార్యకర్తలు ప్రణాళికబద్ధంగా ముందుకెళ్లాలని సూచించారు. పార్టీని నమ్ముకున్న నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పన దశగా పనిచేస్తున్నామన్నారు. ఇప్పటికే 200 మంది యువతకు ప్రభుత్వ అనుబంధసంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించామని, వికాస సంస్థ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించామని, వికాస సంస్థ ద్వారా జాబ్‌మేళా ఏర్పాటు చేసి మరికొంత మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే దశగా చర్యలు చేపట్టనున్నట్టు యనమల తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, ఇనుగంటి సత్యనారాయణ, చింతమనీడి నాగ సోమరాజు, కొయ్య కేశవ్, మల్ల గణేష్, పోలిశెట్టి రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'తో రైతుల ఆదాయం పెంపు

శంఖవరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రైతుల ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమం దోహదం చేస్తుందని జిల్లా వనరుల కేంద్రం ఉపసంచాలకులు బీవీఎస్.హరి తెలిపారు. మంగళవారం నెల్లిపూడిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులకు వివిధ శాఖల ద్వారా చేపడుతున్న పథకాలు, రాయితీలు అందిపుచ్చుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. పశువులకు సంక్రమించే వ్యాధులు, తీసుకోవలసిన జాగ్రత్తలు, పశుగ్రాసం పెంపుపై అవగాహన కల్పించారు. మండల ఏవో పి.గాంధీ, అరుణ్‌కుమార్, శ్రావణి, చిన్నబాబు, మురళీ పాల్గొన్నారు.

తుని రూరల్: వరిలో బెంగాల్ నాట్లు వేసే విధంగా వల్ల అధిక దిగుబడులు సాధ్యమవుతాయని ఏడీఏ సుంకర బుల్లిబాబు స్పష్టం చేశారు. వల్లూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పంట దిగుబడులపై అవగాహన కల్పించారు. ఉద్యానవనశాఖ అధికారి విజయలక్ష్మి, సర్పంచ్ బాబ్జి, కుర్రా రమణ ఉన్నారు.

కోటనందూరు: రైతులు వరిపంటల్లో వచ్చే తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని మండల ఏవో చంద్రశేఖర్ అన్నారు. ఎస్అర్‌పేట, అప్పలరాజుపేట, బిళ్లనందూరులో జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం తెగుళ్లబెడద ఎక్కువగా ఉందన్నారు. ఏఈవో శివకుమారి, గుడివాడ తాతబాబు, బిఅప్పలనాయుడు లగుడు శ్రీను, చింతకాయల భవాని పాల్గొన్నారు.

'స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలి'

తుని రూరల్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీఎస్ మూర్తి స్పష్టం చేశారు. కడియం మండలానికి సంబంధించిన 40 మంది స్వయం సంఘాల సభ్యులతో కలిసి కలెక్టర్ ఆదేశాల మేరకు తుని మండలం తిఇమ్మాపురంలో ఆగరబత్తుల పరిశ్రమను సందర్శించారు. పరిశ్రమ నిర్వాహకుడు తయారీ విధానం, మిషనరీ, మార్కెట్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

కబడ్డీ జట్టు ఎంపికలు

గండేపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలో కబడ్డీ జట్టు ఎంపికలు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ప్రో వైస్‌చాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, డీన్ ప్రొఫెసర్ వి.సత్యనారాయణ, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ త్రిపాఠి, డాక్టర్ ఎస్.రవి పాల్గొన్నారు.

తొండంగి, ప్రత్తిపాడు మండలాల్లో గ్రామ సభలు

తొండంగి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పైడికొండ గ్రామంలో తహశీల్దార్ ముఖర్జీ అధ్యక్షతన రీ సర్వే గ్రామ సభను నిర్వహించారు. వివిధ అంశాలకు సంబంధించి 158 దరఖాస్తులు అందాయి. రైతులు తమకు సంబంధించి రీ సర్వేలో జరిగిన అవకతవకలపై అధికార్లకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ సదస్సులను వినియోగించుకుని సమస్యలకు పరిష్కారం పొందాలని ఆయన సూచించారు. ఆర్ఐ జిఎన్ వి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: మండలంలోని బురద కోటలో ల్యాండ్ రీ సర్వే గ్రామసభను నిర్వహించారు. భూ సంబంధిత సమస్యలకు సంబంధించి 18 వినతులు వచ్చాయి. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఎంవీఎల్ కల్యాణి గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. సర్పంచ్ జిట్ల కాంతం, మాజీ సర్పంచ్ నిమ్మల అప్పారావు, వీఆర్వో భాస్కరరామరాజు,రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

టెలికాం అడ్వైజరీ సభ్యుడిగా మేకల కృష్ణ



మేకల కృష్ణ

శంఖవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా బీఎస్‌ఎన్‌ఎల్ టెలికాం అడ్వైజరీ సభ్యుడిగా శంఖవరానికి చెందిన మేకల కృష్ణ నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ అవకాశం కల్పించిన కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌స్థానిక జనసేన ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు, జిల్లా జనసేన కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

తొండంగి: రాజమండ్రి టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ మెంబరుగా తొండంగి మండలం పైడికొండకు చెందిన పలివెల లోవరాజును నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. రెండేళ్లపాటు సలహా కమిటీ మెంబరుగా కొనసాగనున్నారు.

కాలువల గట్ల పటిష్ట చర్యలు పరిశీలించిన ఏఈ

కిర్లంపూడి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఏలేరు వరదలకు రాజుపాలెం గ్రామంలో గల బెడ్ రెగ్యులేటర్ వద్ద కాలువ గట్లు కొట్టుకుపోయాయి. దీంతో గ్రామాలు ముంపునకు గురయ్యాయి. అయితే ఒకకాలువ గట్టుకు రూ.7.50లక్షలు, మరో గట్టుకు రూ.2.25లక్షలతో తాత్కాలికంగా పటిష్ట పరిచేందుకు ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ పనులను మంగళవారం ఇరిగేషన్ ఏఈ శేషగిరిరావు, ఐజి పరిశీలించారు. మిగతా గట్లు పటిష్ట పరిచేందుకు నిధుల కోసం ప్రతిపాదనలు పంపించామని నిధులు మంజూరు కాగానే వాటి పనులు చేపడతామని తెలిపారు. అలాగే పనులను టీడీపీ నాయకులు గంధం ఈశ్వరరావు, గొడే దొరబాబు పర్యవేక్షించారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్

జగ్గంపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట పాత పోలీస్‌స్టేషన్ వద్ద ప్రతి మంగళవారం జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నారు. మంగళవారం 400మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాదారపు వీరబాబు, రామవరం ఎంపీటీసీ దొడ్డా శ్రీను, సురపు రెడ్డి నరేష్, మొగిలి గంగాధర్, గంధం శ్రీనివాస్, జనసైనికులు ఉన్నారు.

స్వచ్ఛ భారత్‌పై అవగాహన

ఏలేశ్వరం, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పాటించడం ద్వారా రోగాలు దరిచేరవని నగర పంచాయితీ కమిషనర్ ఎం.సత్యనారాయణ తెలిపారు. మంగళవారం 18, 20 వార్డుల్లో శుభోదయం కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ భారత్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్ల మధ్యలో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఇంటింటికి వెళ్లి సూచించారు. పంచాయితీ సిబ్బంది ఉన్నారు.

సత్యదీక్షల సామగ్రి పంపిణీ

ఏలేశ్వరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు నేతృత్వంలో సత్యదీక్షలు స్వీకరించే 54మందికి ఉచితంగా వస్త్రాలు, పూజా పుస్తకాలు, మాలలు, ఫొటోలను కౌన్సిలర్ అలమండ చలమయ్య చేతులమీదుగా అందజేశారు. ఆలయ అర్చకులు పొన్నూరు సత్యనారాయణ, కడింశెట్టి వాసు, గూనాపు అశోక్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి ఫ్యాన్ వితరణ

తుని రూరల్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): స్థానిక పెంటకోట రోడ్డులో సాయి ఆశ్రమ వృద్ధాశ్రమానికి మంగళవారం అలయన్స్ క్లబ్ సభ్యులు ఫ్యాన్ బహూకరించారు. అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కోరుకొండ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయ ప్రసాద్, కోశాధికారి నూకయ్యశెట్టి, క్లబ్ ప్రతినిధులు కుసుమంచి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు సాయం

జగ్గంపేట, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): రావులమ్మ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో జై దుర్గభవాని పాసింజర్ ఆటో యూనియన్ ప్రెసిడెంట్, జనసేన పార్టీ గోకవరం మండల ఉపాధ్యక్షులు గవిని దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామపెద్దలు అన్ని పార్టీ నాయకులు, అన్ని కార్మిక సంఘాల నాయకులతో కలిసి జోలి పట్టి వసూలు చేసిన రూ.88వేల నగదును విజయవాడ వరద బాధితుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ నిమిత్తం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు మంగళవారం అందజేశారు.

కిర్లంపూడిలో భారీ వర్షం

కిర్లంపూడి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా మంగళవారం కిర్లంపూడిలో భారీ వర్షం కురిసింది. రోడ్లు, డ్రైనేజీలు, ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

పోతవరంలో కొమురం భీం జయంతి

దేవీపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దేవారం పంచాయతీ పోతవరం ఎంపీపీ పాఠశాలలో ఆదివాసీ పోరాట యోధుడు కొమురం భీం 123వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ కొమురం భీం జల్-జంగిల్-జమీన్ నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసి ఆదివాసీల స్వయంపాలన రాష్ట్ర సాధనే లక్ష్యంగా పోరాటం సాగించారన్నారు. హెచ్ఎం పి.పండు రెడ్డి, ఉపాధ్యాయుడు కొమరం రామకృష్ణదొర, ఎస్ఎంసీ చైర్మన్ కొమరం వెంకటేశ్వర్లుదొర, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ తుర్రం రమేష్‌దొర, ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర, విద్యార్థులు పాల్గొన్నారు.



కొమురం భీం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు



యువతకు అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

గంజాయి దుష్పరిణామాలపై అవగాహన

అడ్డతీగల, అక్టోబరు 22: అడ్డతీగలలో వారపు సంతను పురస్కరించుకుని పోలీసు అధికారులు గంజాయి నియంత్రణపై సీఐ నరసింహరావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి విక్రయించడం, తాగడం, రవాణా చేయడం నేరమని వివరించారు. సైబర్ క్రైమ్ ఏ విధంగా జరుగుతుందో వివరించి జాగ్రత్తలపై సూచనలిచ్చారు. అటవీ భూములు, పంట భూముల్లో జంతువుల వేట కోసం విద్యుత్ తీగలను అమర్చడం చట్టరీత్యా నేరమని, అటువంటి చర్యలకు పాల్పడవద్దని హితవు పలికారు.